ప్రజాశక్తి

ఆదివారం 30 మార్చి 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

మహా బడ్జెట్ రూ.4601 కోట్లు



బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు, మాట్లాడుతున్న మేయర్



- ఆమోదించిన జివిఎంసి పాలకవర్గం
- సమావేశం ఆలస్యంపై మేయర్‌ను నిలదీసిన కూటమి కార్పొరేటర్లు
- పలువురు వైసిపి కార్పొరేటర్లు డుమ్మా
- వాస్తవాలకు దూరంగా బడ్జెట్ : సిపిఎం
- విద్యకు కేటాయింపులేవీ : సిపిఐ



బడ్జెట్‌పై మాట్లాడుతున్న సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో / ఎంవిపి.కాలనీ

అంచనాలకు మించిన భారీ అంకెల గారడీతో ఉన్న 2025-26 మహా బడ్జెట్‌ను జివిఎంసి పాలక వర్గం శనివారం అమోదించింది. ఆర్థిక సంవత్సరం మరో రెండు రోజుల్లో ముగుస్తున్న నేపథ్యంలో ఈ కౌన్సిల్ మీటింగ్ జివిఎంసి ప్రధాన కార్యాలయంలో నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అధ్యక్షతన జరిగింది. ఈ వార్షిక బడ్జెట్‌కు జివిఎంసి స్థాయీ సంఘం ఆమోద ముద్ర డిసెంబర్‌లోనే వేసింది. 25 లక్షల జనాభా కలిగిన ఓ చిన్న రాష్ట్రానికి సరిపడేలా ఈ బడ్జెట్ రూ.4601 కోట్లతో ఉందన్న చర్చ సర్వత్రా వినిపించింది.

ప్రారంభపు నిల్వ.. ఇతరత్రా..

2025-26 వార్షిక బడ్జెట్ ప్రారంభపు నిల్వ మిగతా 2లో..

నేడు సన్ రైజర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్

ముఖ్య అతిథిగా హాజరు కానున్న ఐసిసి ఛైర్మన్ జై షా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఐపిఎల్ - 2025 సీజన్‌లో భాగంగా ఆదివారం జరగనున్న ఢిల్లీ క్యాపిటల్స్ - సన్ రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌కు మధురవాడలోని ఎసిఎ - విడిసిఎ స్టేడియంలో అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. ఈ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తన మొదటి మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌పై విజయం సాధించి మిగతా 2లో..

నేడు, రేపు ఆస్తి పన్ను చెల్లింపునకు అవకాశం

వార్త 5లో..

అత్తమామలను చంపేందుకు సుపారీ

వార్త 4లో..

మిట్టల్ ప్లాంట్‌పై ఆరాటం ఆపి..

విశాఖ ఉక్కుపై శ్రద్ధ పెట్టండి : సిపిఎం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రైవేటు రంగ ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకై రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఆరాటం ఆపి, విశాఖ ఉక్కు అభివృద్ధికై చిత్తశుద్ధితో కృషి చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటనలో శనివారం డిమాండ్ చేశారు. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట వద్ద ఆగమేఘాల మీద 2200 ఎకరాల భూములను ప్రభుత్వం కేటాయించిందని, దీనికి ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండిసి ద్వారా ఇనుప ఖనిజం సరఫరాకు ఒప్పందం చేయించిందని పేర్కొన్నారు. మిట్టల్ కంపెనీకి ఇనుప ఖనిజం, ముడిసరుకును అంతరాయం లేకుండా పైపుల ద్వారా సరఫరా చేయాలని స్వయానా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధాని మోడీని కోరారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిట్టల్ కంపెనీ విషయంలో శరవేగంగా చేపడుతున్న చర్యలు విశాఖ ఉక్కుపై ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను లాభాలబాట పట్టిస్తామన్న మాటలు ఉత్తివిగానే మిగిలాయన్నారు. మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ద్వారా 20 వేల కొత్త ఉద్యోగాలు కల్పిస్తామంటున్నారని, అదే సమయంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఉన్న వేల ఉద్యోగాలను ఎందుకు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

మహా బడ్జెట్ రూ.4601 కోట్లు

రూ.482.26 కోట్లు, అన్ని పద్దుల కింద జమలు రూ.427.96 కోట్లు, ప్రారంభపు నిల్వతో కలిపి మొత్తం జమలు రూ.476.18 కోట్లు, అన్ని పద్దుల కింద ఖర్చులు రూ.460.14 కోట్లు. ముగింపు నిల్వగా రూ.16.04 కోట్లుగా చూపారు. ఈ బడ్జెట్‌లో ఆదాయం అంచనాలను రూ.4,279 కోట్లుగా చూపించగా సవరించిన బడ్జెట్ అంచనాలతో.. ప్రారంభ నిల్వతో కలిపి 5604.80 కోట్లుగా ప్రవేశపెట్టారు. గత సంవత్సరం కంటే ఆదాయంలో తక్కువగా చూపించారు..

ఎక్కడ నుంచి ఎంతెంత రాక

ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్ను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సర్వీస్ ఛార్జీలు, స్టీల్‌ప్లాంట్, కోర్టు మొదలగు పారిశ్రామిక సంస్థలు చెల్లించవలసిన పన్నులు, సర్వీస్ ఛార్జీలు, ప్రకటనల ఛార్జీలు, సెల్ టవర్లు మొదలగు ఇతర పన్నుల ద్వారా రూ.651.85 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేశారు.

పన్నుల కాకుండా ఇతర ఆదాయ మార్గాల ద్వారా రూ.775.66 కోట్లు, ప్రభుత్వం నుండి రావాల్సిన స్టాంప్ డ్యూటీపై సర్‌ఛార్జి, వృత్తి పన్ను, తలసరి గ్రాంటు, మోటార్ వాహనాల పన్ను, ఆస్తి పన్ను రాయితీ, నష్ట పరిహారాలు, మెజిస్టీరియల్ జరిమానాల ద్వారా రూ.215 కోట్లు వస్తుందని, పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుండి రూ.10 కోట్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా 15వ ఆర్థిక సంఘం అంచనాల మేరకు రూ.500 కోట్లు, అమృత్ పథకం ద్వారా రూ.380 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేశారు.

ఖర్చులు ఇలా..

ఖర్చుల విషయానికి వస్తే... ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి పబ్లిక్ వర్క్స్ విభాగంలో రూ.1355 కోట్లు, విద్యుత్ ఆధునికీరణకు రూ.54 కోట్లు, మంచినీటి సరఫరాకు 67.2 కోట్లు, అమృత్ ప్రాజెక్ట్‌కు 394 కోట్లు చూపారు. సమావేశంలో భాగంగా అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్ల అభిప్రాయాలు, సూచనలు తీసుకున్న అనంతరం మేయర్ బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్, జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ రూ.4601 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించినట్టు ప్రకటించారు.

అంకెల గారడీ బడ్జెట్ : సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు

బడ్జెట్‌పై కౌన్సిల్‌లో జరిగిన చర్చలోనూ, అనంతరం మీడియాతోనూ సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ అంకెల గారడీగా బడ్జెట్ ఉందన్నారు. వాస్తవాలకు దగ్గరలో బడ్జెట్‌ను రూపకల్పన చేయాలని, అందులో కార్పొరేటర్లు అందరినీ భాగస్వామ్యం చేయాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టిలకు కేటాయించిన నిధులను ఖర్చు చేయడం లేదని, కేవలం బడ్జెట్‌లో కేటాయింపులకు మాత్రమే నోచుకుంటున్నాయని తెలిపారు. గత బడ్జెట్‌లో రూ.250 కోట్లును ఎస్‌సి, ఎస్‌టిలకు కేటాయిస్తే కేవలం రూ.20 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని గుర్తు చేశారు. ఈసారి రూ.250 కోట్ల బడ్జెట్‌ను వారికి చూపిస్తున్నారని, ఆ మొత్తాన్ని జివిఎంసి పరిధిలోని ఎస్‌సి, ఎస్‌టి కాలనీలలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి, స్కూళ్ల మరమ్మతులకు వినియోగించేలా ఒక కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. నగరంలో 750కిపైగా మురికివాడలు ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు తెప్పించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి జివిఎంసికి రావాల్సిన నిధులను వెంటనే రాబట్టాలని, ఆ దిశగా కూటమి ప్రభుత్వం కార్పొరేటర్లు కషి చేయాలని కోరారు. జివిఎంసి ఆదాయం, ఖర్చు రూ.1700 కోట్లు దాటకపోయినా భారీగా బడ్జెట్‌ను చూపడం విశాఖ ప్రజలను మోసం చేయడమేనని మండిపడ్డారు. భారీ అంచనాలతో నాలుగు రెట్లు బడ్జెట్ చూపడం సరికాదన్నారు. మురికివాడల్లో సౌకర్యాల కల్పనకు బడ్జెట్‌లో కేటాయింపులు చూపలేదని అన్నారు. ప్రజలు పన్నులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, 15 శాతం ఆస్తి పన్ను పెంపు రద్దుకు కార్పొరేటర్లంతా కృషి చేయాలని కోరారు. బీచ్ రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్, ఎంవిపి,కాలనీలోని స్పోర్ట్స్ ఎరీనాలను ప్రైవేటు వారి నుండి తప్పించి జివిఎంసినే నిర్వహించాలని కోరారు. ప్రజలకు ఉపయోగపడే వాటన్నింటినీ ప్రైవేటుపరం చేసేందుకు, ప్రజలపై రకరకాల భారాలు వేసేందుకు అనుకూలంగా బడ్జెట్‌ను రూపొందించారన్నారు. విద్యకు కేటాయింపులు తగ్గించారని సిపిఐ ఫ్లోర్ లీడర్ ఎజె.స్టాలిన్ మండిపడ్డారు.

మేయర్‌ను నిలదీసిన కూటమి కార్పొరేటర్లు

తొలుత టిడిపి సభ్యులంతా బడ్జెట్ సమావేశం ఆలస్యంపై మేయర్‌ను నిలదీశారు. ఈ సమావేశానికి వైసిపి కార్పొరేటర్లు సరిగా హాజరు కాకపోవడంతో కూటమి కార్పొరేటర్లు స్పందిస్తూ జివిఎంసి బడ్జెట్‌పై వైసిపికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. మేయర్ వెంకట కుమారితో పాటు వైసిపి నుంచి డిప్యూటీ మేయర్లు శ్రీధర్, సతీష్, ఆరో వార్డు కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు హాజరయ్యారు.

విశాఖ ఉక్కుపై శ్రద్ధ పెట్టండి

తొలగిస్తున్నారని ప్రశ్నించారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపునకు స్టీల్‌ప్లాంట్‌లో జరుగుతున్న కుట్రలను తెలియజేశారు. ఈ చర్యలన్నీ విశాఖ ఉక్కును, ఉత్పత్తి కారకులను మరింత సంక్షోభంలోకి నెట్టివేసేనని, ప్రైవేటు బాట పట్టించేవేనని పేర్కొన్నారు. తమకు అధికారమిస్తే విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో అభివృద్ధి చేయడంతో పాటు 8500 మంది ఉక్కు నిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు కల్పిస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చి అఖండ విజయం సాధించారని గుర్తుచేశారు.

ఇప్పటికైనా ఓటేసిన వారి విశ్వాసాన్ని, నమ్మకాన్ని వమ్ము చేయకుండా విశాఖ ఉక్కు పరిరక్షణకై కృషి చేయాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపులను నిలిపివేయాలన్నారు. కేంద్రం ప్రకటించిన ప్యాకేజీ నిధులను సంస్థ ఉత్పత్తికి, ముడి సరుకుకు, యంత్రాలకు, కార్మికుల జీతభత్యాలకు వినియోగించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

లులూ.. గోల్‌మాల్ !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'వడ్డించే వాడు మనవాడైతే ఫంక్తిలో చివర కూర్చున్నా వాటా చేరిపోతుంది' అన్న సామెత నిజమేనని విశాఖ నగరంలో రుజువైంది. టిడిపి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం జిఒ నెంబర్ 45ను విడుదల చేస్తూ ఆర్‌కె బీచ్‌కు అభిముఖంగా ఉండే 13 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని విఎంఆర్‌డిఎ బంధనాల నుంచి తప్పిస్తూ లులూ ఇంటర్నేషనల్ మాల్‌కు చేసిన 'రీ-అలకేషన్' (పునర్ కేటాయింపు)లపై ఇప్పుడు చర్చ నడుస్తోంది. ఆయా భూములను ఎపిఐఐసికి బదలాయించాలంటూ ఈ జిఒ ద్వారా ప్రభుత్వం విఎంఆర్‌డిఎను ఈ నెల 25న ఆదేశించిన సంగతి తెలిసిందే. ఎపిలో ఇంకెప్పుడూ తాను పెట్టుబడులు పెట్టనని లులూ మాల్ అధినేత 2019-2020లో ప్రకటించిన విషయం తెలిసిందే. రెండోసారి వెనక్కి వచ్చి ఆసక్తి చూపారంటే వడ్డించేవారిని బట్టే కదా ? అన్నది దండలో దారం లాగ సారం అర్థమవుతోంది. చంద్రబాబు ప్రభుత్వం 2018లో ఇదే భూమిని రూ.2200 కోట్లకు లులూ మాల్‌కు కేటాయించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం ఇంతటి విలువైన భూములను ప్రైవేట్ షాపింగ్ మాల్‌కు ఇవ్వడం సమంజసం కాదంటూ జరిగిన ప్రజా నిరసనలను దృష్టిలో పెట్టుకుని దీన్ని రద్దుచేసింది. ఈ ఆరేళ్లలో రూ.1500 కోట్లకు కుదించేసి భూములను లులూకు కేటాయించడంలో పెద్ద గోల్‌మాలే జరిగిందని పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



సామాన్య జనంపై భారాలు

విశాఖ నగరం 'ఫైన్ సిటీ (సుందర నగరం), ప్రభుత్వం విధిస్తున్న పన్నుల భారంతో 'ఫైన్స్ సిటీ'గా మారబోతుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. విశాఖ నగర జనంపై ఇప్పటికే ఆస్తి పన్ను ఏటా 15 శాతం మేర పెంచుతూ రూ.500 కోట్ల మేర పన్నుల భారాన్ని జివిఎంసి మోపింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రూ.60 కోట్ల మేర వృత్తి పన్ను వేసేందుకు నిర్ణయించింది. ఇవన్నీ సామాన్యులపై భవిష్యత్‌లో తడిసిమోపెడు కానున్నాయి. నగరం నడిబొడ్డున ఇంటర్నేషనల్ లులూ షాపింగ్ మాల్ వస్తే పర్యవసానాలేమిటి ?. ఆ ఏరియాలో ఇప్పుడున్న ధరల కంటే భారీగా అపార్టుమెంట్ల రేట్లు పెరగనున్నాయి. సామాన్యులపై ఇది భారం కాదా?. డిమాండ్ లేని ప్రాంతాలైన నగర శివారుల్లోని పరదేశిపాలెం, మారికవలస, తగరపువలస వంటిచోట్ల ఇలాంటి భారీ షాపింగ్‌మాల్స్ వచ్చినా పెద్ద సమస్యేమీ ఉండదు. ఆర్‌కె.బీచ్ ఎదురుగా హార్బర్ పార్క్ ఏరియాలోగల 13 ఎకరాలపైన నిర్మాణం కాబోయే ఈ లులూ వల్ల ట్రాఫిక్ సమస్య కూడా తీవ్రం కానుందన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఉపాధి, ఉద్యోగ అవకాశాల విషయానికొస్తే 7 వేల ఉద్యోగాలు అని లులూ యాజమాన్యం వెల్లడించినా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కలిపి ఈ లెక్క ఉంది. దీంట్లో వచ్చే జాబ్స్ కూడా నైపుణ్యం కలిగినవి ఎంతమాత్రమూ కాదు. అరకొర వేతనాలతో ఉద్యోగ నియామకాలు ఉండ నున్నాయి.

నేడు సన్ రైజర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్

(మొదటి పేజీ తరువాయి..) మంచి జోరు మీద ఉండగా సన్ రైజర్స్ తన తొలి మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై విజయం సాధించి, రెండో మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌పై పరాజయం పాలైంది. ఆదివారం జరిగే మ్యాచ్‌కు సంబంధించి అన్ని టికెట్లూ ఇప్పటికే అమ్ముడుపోయాయని అధికారులు తెలిపారు. మ్యాచ్‌ను వీక్షించేందుకు ఐసిసి ఛైర్మన్ జై షా వస్తున్నారని ఎసిఎ అధికారులు తెలిపారు. ఆదివారం జరగనున్న మ్యాచ్‌లో పాల్గొనేందుకు ఇప్పటికే ఇరు జట్లు విశాఖకు చేరుకున్నాయి. శనివారం సాయంత్రం స్థానిక మైదానంలో ముమ్మర సాధన చేశాయి.

ఎక్కుజె కళాశాలలో రక్తదానం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గుడిలోవ ఎక్కుజె కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పీజీ కళాశాల విద్యార్థులు 30 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రోటరీ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యాన రక్తాన్ని సేకరించారు. అనంతరం కళాశాలల కరస్పాండెంట్ ఐహెచ్ ఫారుఖీ మాట్లాడుతూ, రక్తదానం మరొకరికి ప్రాణదానం అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ పి.సుధారాణి, ఎన్ఎస్ఎస్ పిఒ పవన్‌కుమార్, విశాఖపట్నం బ్లడ్ డోనర్స్ క్లబ్ సభ్యులు రామకృష్ణ, ప్రతాప్, విశాల్, అంకిత్ పాల్గొన్నారు.

చెత్త నుండి సంపద తయారీపై అవగాహన

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : మండలంలోని రేఖవానిపాలెంలో చెత్త నుంచి సంపద తయారీపై శనివారం పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో నిర్వహించిన ఈ అవగాహన సదస్సులో ఇఒపిఆర్‌డి కె.రమేష్‌నాయుడు మాట్లాడుతూ, సంపద తయారీ కేంద్రం నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీ వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. రేఖవానిపాలెం, మూలకుద్దు పంచాయతీల సర్పంచులు సమ్మిడి శ్రీనివాసరావు, కొయ్య రామకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్ద సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు అధ్యక్షతన ఆనందపురం మండలంలో అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్, గ్రీన్ గార్డులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వెల్లంకి పంచాయతీని చెత్త నుండి సంపద తయారీ కేంద్రం లోకల్ శిక్షణ కేంద్రంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఎంవిఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ, తడి, పొడి చెత్త వేరు చేయుట, సేకరించిన చెత్తను కేంద్రాల వద్ద ఎరువుగా చేయు విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్‌మూర్తి, రామకృష్ణనాయుడు, రఘునాథ్‌బాబు, ధనుంజయరావు, చలపతిరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక పోలీస్ స్టేషన్ పరిధి చైతన్యనగర్‌లో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... వసుధ ఫార్మా కంపెనీలో వసంతుల యతీష్‌కుమార్(25) కాంట్రాక్టు కార్మికునిగా పనిచేస్తున్నాడు. గత కొన్ని రోజులుగా చైతన్య నగర్‌లో నివాసముంటున్నాడు. శనివారం ఆ ఇంటి తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన స్థానికులు కిటికీలోంచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. దీంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు.

ఘనంగా తెలుగుదేశం ఆవిర్భావ దినోత్సవం



టిడిపి విశాఖ జిల్లా కార్యాలయంలో పాల్గొన్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా, వెలగపూడి

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల తెలుగుదేశం ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాలను ఎగురవేశారు. పాదయాత్రలు చేశారు.

మధురవాడ : జివిఎంసి 5, 6 7 వార్డుల్లో తెలుగుదేశం నాయకులు జెండాలను ఎగురవేశారు. పరదేశిపాలెం, క్రికెట్ స్టేడియం, వాంబేకాలనీల్లో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో కార్పొరేటర్ మొల్లి హేమలత, దాసరి శ్రీనివాసరావు, పిళ్లా మంగమ్మ, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం : పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి రామమూర్తి పంతులుపేట వరకు కార్యకర్తలతో కలిసి ప్రభుత్వ విప్ గణబాబు పాదయాత్ర నిర్వహించారు. రామమూర్తిపంతులుపేట వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పద్మనాభం : మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో టిడిపి జెండాలను ఆయా గ్రామాల టిడిపి అధ్యక్షులు ఎగురవేశారు. బి.తాళ్లవలసలో పార్టీ మండల అధ్యక్షులు జెండాను ఆవిష్కరించారు కోరాడలో గెద్ద ప్రసాదు జెండాను ఎగురవేశారు.

భీమునిపట్నం : స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు గంటా రవితేజ ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గంటా నూక రాజు, పాసి నరసింగరావు, గొలగాని నరేంద్ర కుమార్, సిహెచ్.రమణ తదితరులు పాల్గొన్నారు. స్థానిక చిన్న బజారు జంక్షన్‌లో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు.

ఆనందపురం : ఆనందపురం కూడలి వేములవలస పూల మార్కెట్ సమీపంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి రాజబాబు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో శ్రీనాథ్ నారాయణరావు, స్వరాల సత్య వరప్రసాద్, బి.అప్పారావు పాల్గొన్నారు. ఆనందపురంలో నిర్వహించిన కార్యక్రమంలో కొట్యాడ సత్యమూర్తి, రెడ్డి బాబు, రాము పాల్గొన్నారు

ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు పరిధి పెదగదిలి, తోటగరువు, అంబేద్కర్ కూడలి, దుర్గానగర్, టిఐసి పాయింట్ ప్రాంతాల్లో టిడిపి జెండాను ఎగురవేశారు. ఆయా ప్రాంతాల్లో ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళుల అర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఒమ్మి సన్యాసిరావు, గాడి సత్యం, బుడుమూరి గోవిందు పాల్గొన్నారు.

10వ వార్డులో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి ఆధ్వర్యాన రవీంద్రనగర్, ఎస్ఐజి నగర్, వివేకానందనగర్, సుందర్‌నగర్, బిఎన్ఆర్‌నగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గాడు అప్పలనాయుడు, మద్దిల రాజేష్ పాల్గొన్నారు.

11వ వార్డు పరిధి రవీంద్రనగర్ -2, శ్రీహరినగర్, కైలాసనగర్, టిఐసి పాయింట్ ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ముగడ రాజారావు, రాగతి అచ్చుతరావు, మూది అప్పారావు పాల్గొన్నారు.

13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీలో పొత్రకండ ధర్మారావు ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మజ్జి రమణి, యల్లమిల్లి సురేష్, తురకపూడి బాలస్వామి, పాల్గొన్నారు.

13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యాన ఆమె కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కెల్ల సత్యనారాయణ, బేత దుర్గారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జీ పార్టీ జండా ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీనియర్ నేతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గండి వంశీదీప్, భరిణికాన సాయినాథరావు, గండి ముత్యాలనాయుడు, గండి దేముడు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని తానాంలో ఎన్‌టి.రామారావు విగ్రహానికి అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కర్నాలు వెంకటరమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పైల అప్పారావు, కె.రమేష్, వర్రి వసంతరావు, పైల జానకిరామ్ పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని కింతాడ పంచాయతీ పరిధి కూండ్రపువానిపాలెంలో ఎన్‌టి.రామారావు చిత్ర పటానికి టీడీపీ క్లస్టర్ ఇంచార్జి కన్నూరు సూర్యనారాయణ, నాయకుడు బండారు రవితేజపాత్రుడుతో కలిసి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జోగ దేముడు, కన్నూరు అప్పలనాయుడు, బత్తి వెంకట రమణ, బండారు రాము తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో టిడిపి నాయకులు పార్టీ జెండాల ఆవిష్కరించారు. దేవరాపల్లి మహేశ్వరి నాయుడు ఇంటి వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పార్టీ మండల అధ్యక్షులు ఉపాధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, కోమారా బాబురావు పూలమాలవేశారు. కార్యక్రమంలో గొర్లె దేవుళ్ళు, దుక్క సత్తిబాబు, జి సత్తిరాజు, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పార్టీ జెండాను మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర ఆవిష్కరించారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. జివిఎంసి 80వ వార్డు చినరామస్వామి కోవెల వద్ద సత్యనారాయణ స్వామి, సూర్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ బొడ్డేడ మురళి జెండా ఆవిష్కరణ చేసి, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పిళ్ళా కొండయ్య నాయుడు, విల్లూరి రమణబాబు, పెంటకోట చంద్రరావు, ఆడారి జగన్నాథరావు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని నాగులపల్లిలో టిడిపి నేత దొడ్డి శ్రీనివాసరావు, నారాయుడుపాలెంలో సబ్బి శ్రీనివాస్ యాదవ్‌ల ఆధ్వర్యంలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. తిమ్మరాజుపేటలో భీమర శెట్టి శ్రీనివాసరావు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని అచ్చెర్ల గ్రామంలో టిడిపి గ్రామ అధ్యక్షులు నైనంశెట్టి రమణారావు పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది, బంగారుమెట్ట గ్రామాల్లో మాజీ సర్పంచ్ తమరాన దాసు, ఎంపీటీసీ ఎలపు జగ్గారావు, మాజీ ఎంపీటీసీ దొండ శ్రీను, సాయం శేషు, టిడిపి మండల అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు, ఎంపిపి డి.నాగేశ్వరీ దేవి, మాజీ ఎంపిపి ఎంవీవీ సత్యనారాయణ, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ డి అప్పలనాయుడు, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.



కె.కోటపాడు మండలం కింతాడలో...

నక్కపల్లి: నక్కపల్లి లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేసి, కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

మాడుగుల: పేదవాడి సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందని శాసన సభ్యులు బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. మాడుగుల లో టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షులు వడ్డాది రంజిత్ వర్మ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి ఎమ్మెల్యే బండారు హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష కార్య దర్సులు అద్దెపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు పాల్గొన్నారు.

కోటవురట్ల: మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో జానికి శ్రీను, పాములవాక గ్రామంలో వేచాలపు జనార్ధన్ పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రావు, జానకి హరి, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిడెస్క్: గొలుగొండ మండలం ఏఎల్.పురం, పాతకృష్ణదేవిపేట, సీహెచ్.నాగాపురం, కొంకసింగి, లింగంపేట, చోద్యం, విప్పలపాలెం తదితర గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. మేజర్ పంచాయతీ ఏఎల్.పురం స్థానిక శరభన్నపాలెం జంక్షన్ వద్ద గ్రామ పార్టీ అధ్యక్షుడు బొడ్డు జమీలు ఆధ్వర్యాన పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. సీనియర్ నాయకులు గాడి అప్పలనాయుడు, పెట్ల నారాయణమూర్తి, పోతల రాజులునాయుడు పార్టీ జెండాను ఆవిష్కరించారు.

రావికమతం: మండల కేంద్రంలో సర్పంచ్ గెంజి మోది నాయుడు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలో గుమ్మాలపాడు, కెబిపి అగ్రహారం, మరుపాక, గుడ్డిప తదితర గ్రామాలలో ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ వార్డు నెంబర్లు పులగాయల గోవిందు, ఎంపిటిసి వేపాడ నాగేశ్వరావు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ విశాఖ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తెలుగు వారి గుండె చప్పుడుగా టిడిపి పేరుగాంచిందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభివర్ణించారు. తొలుత ఆయన విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబులతో కలిసి కార్యాలయ ఆవరణలో జెండా ఎగురవేశారు. అనంతరం కార్యాలయంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ కార్యకర్తలు, నాయకులకు శాలువా కప్పి పూలమాలలతో సన్మానం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పొలమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బివి.రామ్ ఆధ్వర్యాన..

తెలుగుదేశం ప్రజల పార్టీ అని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీచ్ రోడ్డులోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఆయన ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌టి.రామారావు పార్టీ పెట్టిన 9 నెలల కాలంలోనే అధికారంలోకి వచ్చి ప్రపంచ రికార్డు సాధించారన్నారు. ఆ తరువాత చంద్రబాబు పార్టీని ముందుకు తీసుకెళ్లారన్నారు. తెలుగువారి పౌరుషం చాటి చెప్పారన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి బోడేపూడి దొరబాబు, మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్యాం ప్రసాద్, టిడిపి 14వ వార్డు అధ్యక్షులు పివి.వసంతరావు, లాడి కిషోర్ కుమార్, బి.దన్ని, ఇ.సత్తిబాబు, దువ్వి పరమేశ్వరరావు పాల్గొన్నారు.



ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బివి.రామ్

'ఉక్కు' రక్షణపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, సొంత గనులు కేటాయించాలని, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులు నిలిపివేయాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ముద్రించిన కరపత్రాలను సిఐటియు జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ద్వారకా ఆర్‌టిసి కాంప్లెక్స్ ఇన్‌గేట్ వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, జగదాంబ జోన్ నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు మాట్లాడుతూ ప్లాంట్‌ను పోరాటాలతో కాపాడుకుంటామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ సహా ఇతర ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరానికి ఏప్రిల్ 1కి నాలుగేళ్ల పూర్తవుతాయన్నారు. ఈ సందర్భంగా ఆ రోజున మహా ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమౌళి, కె.చంద్రశేఖర్, కె.నర్సింగరావు, నాగరాజు, కె.కుమారి, త్రినాథ్‌లతోపాటు విద్యార్థి సంఘ నాయకులు అజయ్, సాయి పాల్గొన్నారు.

మధురవాడ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవాలని కోరుతూ మధురవాడలో సిఐటియు, ఎఐటియుసి, ఐద్వా నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పి.రాజుకుమార్, వి.సత్యనారాయణ, డి.అప్పలరాజు, డి.కొండమ్మ, బి.భారతి, ఎం.బంగారయ్య, కె.రాము తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : స్టీల్‌ప్లాంట్‌కు జరుతున్న అన్యాయాన్ని తెలియజేస్తూ శనివారం తోటగరువు కూడలిలో ఆటోలు, బస్సుల్లో ప్రయాణికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని, కాంట్రాక్టు కార్మికులను తొలగించవద్దని, ప్లాంట్‌కు గనులు కేటాయించాలని, బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఏప్రిల్ 1వ తేదీన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టే ధర్నాను విజయవంతంచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.శంకరరావు, డి.నాగరాజు, వి.తులసీరామ్, ఎ.రమణ, పి.శేఖర్, సిహెచ్ గోపి, అప్పలనాయుడు, చంద్రమౌళి, రామలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

1న మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపు



ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ప్రచారం నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

అత్తమామలను చంపేందుకు సుపారీ

ప్రజాశక్తి-ఉక్కునగరం : అత్త మామలను హత్య చేసేందుకు అల్లుడు కరణం శ్రీనివాస్ కుట్ర చేయడంతో అతనిని అరెస్టు చేసినట్లు సౌత్ ఎసిపి త్రినాథ్ తెలిపారు. దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నగర పోలీస్ కమిషనర్‌కు వాట్సాప్ 7995095799కు బాధితులు చల్లంగి సూర్యనారాయణ, సరస్వతి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. స్పందించిన నగర సిపి శంఖబ్రత బాగ్చి ఈ కేసు విచారణను సౌత్ ఎసిపి త్రినాథ్‌కు అప్పగించారు. విచారణలో పలు అంశాలు వెలుగు చూసినట్టు ఎసిపి తెలిపారు. 2017లో కరణం శ్రీనివాస్, మౌనిక ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక బాబు ఉన్నాడు. కొంత కాలం తరువాత వీరి మధ్య మనస్పర్ధలు రావడంతో మౌనిక దువ్వాడ పరిధిలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. కొడుకును చూడనివ్వడం లేదన్న కోపంతో కరణం శ్రీనివాస్ ఒక రౌడీతో రూ.లక్ష సుపారీకి అత్తమామలను చంపేందుకు మాట్లాడుకొని రూ.30 వేలు అడ్వాన్సుగా ఇచ్చినట్టు వెల్లడించారు. ఈ మాటల సంభాషణ వాట్సాప్ ద్వారా మౌనిక తండ్రికి చేరింది. దీంతో మౌనిక తండ్రి ఈ వాయిస్ రికార్డ్‌ను నగర పోలీస్ కమిషనర్‌కు పంపించి ఫిర్యాదుచేశారు. సిపి ఆదేశాల మేరకు విచారణ చేయగా సంభాషణ నిజమని తేలింది. దీంతో నిందితుడు కరణం శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్టు ఎసిపి తెలిపారు.

పిహెచ్‌సిలను సందర్శించిన డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-సీతమ్మధార : నగర పరిధిలోని స్వతంత్రనగర్, మురళీనగర్, భానోజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను, మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిఎం అండ్ హెచ్ఒ పి.జగదీశ్వరరావు శనివారం సందర్శించారు. ఎన్‌సిడి 3.0, అభ ఐడి జనరేషన్, హెచ్‌బివైసి విజిట్స్‌ను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. తదుపరి వైద్య ఆరోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఒపి, ఐపి, ల్యాబ్ టెస్ట్స్, సాధారణ ప్రసవాలు, ఎన్‌సిడిసిడి సర్వే, అభ ఐడి శతశాతం, ఆర్‌సిహెచ్ రిజిస్ట్రేషన్స్, కెపిఐ ఇండికేటర్స్ గురించి పలు సూచనలు చేశారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం జరగాలన్నారు.

విశాఖ డెయిరీలో అధికారుల సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డెయిరీలో సిఐటియుకు అనుబంధంగా అధికారుల నూతన సంఘం ఏర్పడినట్లు విశాఖ డైరీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.రమణ తెలిపారు. విశాఖ డెయిరీ సిఐటియు ఆఫీసులో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అధికారులందరూ సమావేశమై సమస్యల పరిష్కారం కోసం సిఐటియు అనుబంధ కార్మిక సంఘంగా ఏర్పడినట్లు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా అమలు కాని సమస్యలను సిఐటియు ఆధ్వర్యాన వివిధ రూపాల్లో పోరాడి సాధించుకున్నామని గుర్తుచేశారు. అధికారుల సమస్యలు ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాకపోవడంతో వారు సిఐటియుకు అనుబంధంగా సంఘాన్ని ఏర్పాటుచేశారని తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎన్.రాజేంద్రప్రసాద్, ముఖ్య సలహాదారుగా శనివాడ రమణ, అధ్యక్షులుగా పతివాడ గౌరీశంకరరావు, సెక్రటరీగా గుండ్రెడ్డి సూర్యనారాయణ, ఉపాధ్యక్షులుగా భూలోకనాయుడు, ట్రెజరర్‌గా పోతుల శ్రీనివాస్, మెంబర్లుగా నరవ ముత్యాలనాయుడు, పుల్లేటి హరిబాబు, కర్రి వెంకటఅప్పారావు, జి.మూర్తి, వి.మాణిక్యం ఎన్నికయ్యారు.

ఎంవిఆర్‌లో ఉగాది వేడుకలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఎంవిఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఆంధ్ర యూనివర్సిటీ తెలుగు విభాగం ఆచార్యులు సీతారత్నం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, అందరం ప్రకృతితో కలిసి నడుచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కళాశాల సెక్రటరీ రామారావు మాట్లాడుతూ, కాలానుగుణంగా జరుపుకునే పండుగ ఉగాది అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎ.బాలకృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వై.ఈశ్వరరాజు, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్‌వి.కృష్ణ పాల్గొన్నారు.

'శారదా పీఠం ఆక్రమణల తొలగింపులో మీనమేషాలు'

ప్రజాశక్తి-పెందుర్తి : విశాఖ శారదా పీఠంలో ఆక్రమణలు జరిగాయని నిర్ధారించిన అధికారులు వాటిని తొలగించేందుకు మీనమేషాలు ఎందుకు లెక్కిస్తున్నారని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ ప్రశ్నించారు. శనివారం పెందుర్తి తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌ను కలిసి శారదాపీఠం ఆక్రమణల తొలగింపుకు సంబంధించిన వివరాలను బివి.రామ్ అడిగి తెలుసుకున్నారు. శారదా పీఠం అధికారులు మూడు వారాలు గడువు కోరారని తహశీల్దార్ చెప్పారు.

ఆప్కాస్‌ను రద్దుచేసి ప్రయివేటుకు ఇవ్వొద్దు

ప్రజాశక్తి -ములగాడ : ఆప్కాస్ రద్దుచేసి ప్రయివేటు ఏజెన్సీలకు కట్టబెట్టే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం విరమించాలని జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్‌చేసింది. జివిఎంసి 58, 59, 60 వార్డుల్లోని జివిఎంసి కాంట్రాక్టు వర్కర్ల జనరల్ బాడీ సమావేశం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జివిఎంసి కాంటాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఆర్.లక్ష్మణమూర్తి హాజరై మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలను కాపాడుతున్న మున్సిపల్ కార్మికుల జీవితాలతో ఆటలాడు కోవద్దని కోరారు. ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ స్థానంలో ప్రయివేటు ఏజెన్సీలను ఏప్రిల్ ఒకటి నుండి అమల్లోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. ప్రయివేటు ఏజెన్సీకి అప్పగిస్తే ప్రతి నెలా ఒకటో తేదీకి జీతాలు రావని, దళారీల దోపిడీ పెరుగుతుందని, పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా అమలు కావని తెలిపారు. ఈ మేరకు ఏప్రిల్ 2వ తేదీ ఉదయం 10 గంటలకు రైల్వే డిఎంఆర్ ఆఫీస్ నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో కార్మికులంతా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కాంటాక్టు వర్కర్స్ యూనియన్ మల్కాపురం జోన్ అధ్యక్షుడు కె.రమణ, కార్యదర్శి బి.రాంబాబు, బి.సూరిబాబు, డి.రాము, తిరుపతిరావు, గంగులు, సిహెచ్.లక్ష్మి, రమణమ్మ, శ్యామల, ఎస్.దేవి, దుర్గ, అప్పలకొండ పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్ ప్రయివేటుకొద్దంటూ నిరసన

ప్రజాశక్తి -మాధవధార : విశాఖ పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను ప్రయివేటుకు దారాదత్తం చేయొద్దని, పోర్టు నిధులతో అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ మాధవధార కళింగ నగర్ ఈస్ట్ పార్క్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కె.స్వతంత్రకుమార్ మాట్లాడుతూ, విశాఖపట్నం పోర్టు యాజమాన్యం పిపిపి పద్ధతిలో టెండర్లను ఆహ్వానించడం దుర్మార్గం అన్నారు. దీనివల్ల పోర్టు ఉద్యోగులు, పెన్షనర్లు, కార్మికుల ఆరోగ్యం ప్రమాదం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం, పోర్టు యాజమాన్యం తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు. లేకుంటే భవిష్యత్తులో మరిన్ని నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు కె.సుధాకరరావు, స్టీల్‌ప్లాంట్ నాయకులు కూన వెంకట్రావు, జెవి.లక్ష్మి, మంగ్మీ, ఐద్వా నాయకులు కె.పార్వతి, కె.జనార్ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవంతిలో ముగిసిన యువజనోత్సవాలు

ప్రజాశక్తి- తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్ర వారం ప్రారంభమైన 'అవెన్సిస్ 2 కె 25' యువజనోత్సవాలు శనివారం ముగిశాయి. ముఖ్య అతిథిగా హాజరైన దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ, భారత దేశం రానున్న రోజుల్లో ప్రపంచంలోనే అత్యున్నత స్థానంలో నిలుస్తుందంటూ ఆశాభావం వ్యక్తం చేశారు. అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. విశాఖ, త్యానిష్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కె.బాలమురళి మాట్లాడుతూ, ఫార్మసీ రంగంలో అపారమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. సంగివలస, అనిల్ నీరుకొండ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ప్రతిమాదేవి మాట్లాడుతూ, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని విద్యార్థులకు సూచించారు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత, గౌహతి, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ చీఫ్ కోచ్ ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, క్రీడల్లో నైపుణ్యం సాధిస్తే ఉన్నత స్థాయి ఉద్యోగాలు పొందవచ్చన్నారు. బ్రహ్మ కుమారి మాధురి మాట్లాడుతూ, జ్ఞానం పెంచుకోవడం ద్వారా ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సినీ నేపథ్య గాయకులు సుమన్ కుమార్, నాదా ప్రియ యువతను హుషారైన పాటలతో ఉర్రూతలూగించారు. ఈ కార్యక్రమంలో అవంతి విద్యా సంస్థల ఉపాధ్యక్షులు సందీశ్, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, ప్రిన్సిపల్స్ ఎంబివి.రాజు, పి.రామకృష్ణ, జగదీష్, ప్రోగ్రాం కన్వీనర్లు షరీఫ్, అనంతరావు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు తదితరులు

పాఠశాలకు ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి -మధురవాడ : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల తరగతి గదులకు 52 సీలింగ్ ఫ్యాన్ల గంటా రవితేజ తన సొంత నిధుల నుంచి వితరణగా అందించారు. గత నెలలో జరిగిన పాఠశాల కమిటీ సమావేశంలో రెండవ అంతస్తులోని తరగతులలో విద్యార్థులకు సీలింగ్ ఫ్యాన్లు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని కమిటీ తీర్మానించి, ఈ అవసరాన్ని గంటా రవితేజకు విన్నవించగా, తక్షణం స్పందించి సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. స్థానిక నాయకులు యార్లగడ్డ జీవన్‌కుమార్ ఆధ్వర్యాన స్కూల్ కమిటీ చైర్మన్ అచ్యుతరావు, సభ్యుల సమక్షంలో వీటిని తరగతి గదులలో అమర్చారు. గంటా రవితేజకు ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి ధన్యవాదాలు తెలియజేశారు.

శంకరరావు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పాండ్రంగి జిల్లా పరిషత్ హైస్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు మామిడిపల్లి శంకరరావు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో శంకరరావు మాస్టార్‌ను ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యాన సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

క్రీడా హబ్‌గా విశాఖ

- శాప్ చైర్మన్ రావినాయుడు

ప్రజాశక్తి -మధురవాడ : విశాఖను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. కొమ్మాదిలోని శాప్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ క్యాంప్లెక్స్ స్థలాన్ని విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ, అంతర్జాతీయ, ఒలింపిక్స్‌కు క్రీడాకారులను తయారుచేసు కోవాలన్నారు. అభివృద్ధిలో భాగంగా ఈ స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. పి4లో భాగంగా విశాఖలో ఉన్న పారిశ్రామిక వేత్తలు ముందుకొస్తే మంచి క్రీడాకారులను తయారుచేయ వచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఒ జూన్ గ్యేలియేట్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వ దర్శనాలు

ప్రజాశక్తి -మధురవాడ : రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం (టిటిడి)లో ఆదివారం ఉగాది సందర్భంగా ఉదయం 6.30 నుండి రాత్రి 9.30 గంటల వరకు భక్తులకు సర్వదర్శనాలను కల్పించనున్నట్లు ఆలయ ఎఇఒ జగన్మోహనాచార్యులు తెలిపారు. ఉదయం 9 గంటలకు పంచాంగ శ్రవణం ఉంటుందని పేర్కొన్నారు.

టిడిఆర్ బాండ్లపై మంత్రి లోకేష్ పర్యటనను వ్యతిరేకిస్తాం

సిపిఎం నేతలు రాము, అప్పారావు, సదాశివరావు



మాట్లాడుతున్న సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అచ్యుతాపురం -అనకాపల్లి రహదారి విస్తరణ నిర్వాసితులకు టిడిఆర్ బాండ్లు ఇస్తామని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ చెప్పిన నేపథ్యంలో ఈ నెల 31న అచ్యుతాపురం వస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్యటనను వ్యతిరేకిస్తామని సిపిఎం మండల కన్వీనర్ ఆర్.రాము, సీనియర్ నాయకులు కర్రి అప్పారావు, కె.రామసదాశివరావు స్పష్టం చేశారు. రహదారి విస్తరణ నిర్వాసితుల ఎదుర్కొంటున్న సమస్యలపై అచ్యుతాపురంలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామ రెవెన్యూ ప్రకారం గజానికి రూ.15వేలు నుండి రూ.25 వేలు వరకు నగదు రూపంలో చెల్లిస్తామని అందరితో గ్రామసభలలో సంతకాలు చేయించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ఎమ్మెల్యే టిడిపి బాండ్లు మాత్రమే ఇస్తామని చెబుతూ రోడ్డు నిర్వాసితులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని తెలిపారు. దీనిని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. నిర్వాసితులకు నగదు రూపంలో వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 31న అచ్యుతాపురం వస్తున్న మంత్రి నారా లోకేష్ పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు బుద్ధ రంగారావు, కె.సోమునాయుడు, ఎస్.బ్రహ్మాజీ, బి.రామ్‌కుమార్, చేపల తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

నగదు రూపంలోనే పరిహారం ఇవ్వాలి

మునగపాక : అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణ నిర్వాసితులకు నగదు రూపంలోనే పరిహారం అందజేయాలని వైసిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక పిఎసిఎస్ కార్యాలయం ఆవరణలో శనివారం నిర్వాసితులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం టిడిఆర్ బాండ్లు ఇస్తామని చెప్పడం మోసగించడమే అవుతుందన్నారు. టిడిఆర్ అనేది మున్సిపల్, జివిఎంసి పరిధిలో తప్ప గ్రామీణ ప్రాంతాలలో లేదని, ఈ రోడ్డు మార్గం వుడా పరిధిలో ఉందని ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం మానుకోవాలని హితవుపలికారు. అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డు ఆర్ అండ్ బి పరిధిలో ఉందన్నారు. శాసనసభ్యులు, కలెక్టర్ ఇప్పుడున్న పరిస్థితిని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి రోడ్డు విస్తరణలో నష్టపోతున్న నిర్వాసితులకు న్యాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిర్వాసిత సంఘ నాయకులు, నిర్వాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వైసిపి నేత ప్రసాద్, నిర్వాసితులు



ఎంపికైన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం : రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు అనకాపల్లి జిల్లా సీనియర్ క్రీడా జట్టును అచ్యుతాపురం పోలీస్ గ్రౌండ్స్‌లో శనివారం ఎంపిక చేశారు. నేషనల్ కోచ్ వెంకట్ జిల్లా జట్టు ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు అనంతపురం జిల్లా డిటిసి పోలీస్ గ్రౌండ్లో ఏప్రిల్ 14, 15 తేదీల్లో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్నట్లు నేషనల్ కోచ్ వెంకట్ తెలిపారు. కార్యక్రమంలో కూండ్రపు వెంకునాయుడు, ఎస్ఎన్‌వి జగదీష్, కూండ్రపు రమేష్, పైలా అప్పలనాయుడు పాల్గొన్నారు

జయమ్మ మృతికి సిఐటియు సంతాపం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని చౌడపల్లి అంగన్వాడి టీచర్ జి జయమ్మ శనివారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, మండల కార్యదర్శి కె సోము నాయుడు, అంగన్వాడీ కార్యకర్తలు సంతాపం తెలియజేశారు.

నేడు, రేపు పని చేయనున్న సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు

ప్రజాశక్తి-కె.కోటపాడు : భూములు, ఇండ్లు క్రయ విక్రయాలకు సంబంధించిన సేవలు ఈ నెల 30, 31 తేదీల్లో అందుబాటులో ఉంటాయని స్థానిక సబ్ రిజిస్ట్రార్ ఆర్.శకుంతల దేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్ పండుగ అయినప్పటికీ ఆర్థిక సంవత్సరం చివరి రోజులు కావడంతో ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు ఆ రోజుల్లో ఎటువంటి అదనపు రుసుములు లేకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు, రేపు ఆస్తి పన్ను చెల్లింపునకు అవకాశం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలోగల గృహ యజమానులు / ఆస్తిపన్ను చెల్లింపుదారులు ఆది, సోమవారాలు ప్రభుత్వ సెలవు దినాలైనప్పటికీ ఆస్తి పన్ను చెల్లించవచ్చని జివిఎంసి డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్ పర్వదినాల సందర్భంగా ప్రభుత్వ సెలవులు ఉన్నప్పటికీ జివిఎంసి ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాలలోగల సౌకర్యం కేంద్రాలు ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంటాయన్నారు.

ఫ్యాప్టో నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో రాష్ట్ర ఫ్యాప్టో కో చైర్మన్ చందోలు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో అనకాపల్లి జిల్లా ఫ్యాప్టో కార్యవర్గం ఎన్నిక జరిగింది. అనకాపల్లి జిల్లా ప్రస్తుత ఫ్యాప్టో చైర్మన్ గొంది చిన్నబ్బాయి నూతన కార్యవర్గాన్ని ప్రతిపాదించగా, సెక్రటరీ జనరల్ వై.సుధాకర్ బలపరిచారు. నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఫ్యాప్టో జిల్లా నూతన చైర్మన్‌గా బోయిన చిన్నారావు, సెక్రటరీ జనరల్‌గా వై.సుధాకర్‌రావు (ఎస్టీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం) డిప్యూటీ సెక్రటరీ జనరల్స్‌గా గొంది చిన్నబ్బాయి (యుటిఎఫ్), ఆచంట రవి (ఎస్‌టియు), సిరికి దుర్గాప్రసాద్ (ఏపిటిఎఫ్ 257), వై.జానకి రామునాయుడు (ఏపిటిఎఫ్ 1938), కో చైర్మన్లుగా జిఎస్ చక్రవర్తి (బిటిఏ), ఎంజె రవీంద్రబాబు (హెచ్ఎంఏ), కోశాధికారిగా కెఎస్ సాయి ప్రసాద్ (డిటిఎఫ్) ఎన్నికయ్యారు. రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి ఉపాధ్యాయ సమస్యలపై పనిచేస్తామని కార్యవర్గం తీర్మానం చేసింది.



అభివాదం చేస్తున్న ఫ్యాప్టో నేతలు

పాఠశాల పరిసరాల్లో మద్యం దుకాణం పెట్టొద్దు

విజయరామరాజుపేటలో స్థానికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న విజయరామరాజుపేట గ్రామస్తులు

ప్రజాశక్తి-వడ్డాది : పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల పరిసరాల్లో వైన్ షాప్ పెట్టొద్దని కోరుతూ జిల్లా అంబేద్కర్ యువజన సేవా సంఘం, ద్వారా సంఘాల ఆధ్వర్యాన బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేటలో స్థానికులు శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ కాలనీకి అనుకొని ఉన్న జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, మండల పరిషత్తు పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని, వీటి పరిసర ప్రాంతాల్లో వైన్ షాపులు పెడితే విద్యార్థులకు, స్థానిక కాలనీవాసులకు చాలా ఇబ్బందికరంగా ఉంటుందని తెలిపారు. వైన్‌షాప్ దగ్గరలో మంచినీటి బోరు ఉందని, మెయిన్ రోడ్ కావడంతో తరచూ మహిళలు సంచరిస్తుంటారని, ఈ ప్రాంతంలో మందుబాబులు హడావిడి చేస్తుంటే మహిళలకు ఇబ్బందిగా ఉంటుందని వారు పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతంలో వైన్ షాపుకు పర్మిషన్ ఇవ్వద్దని కోరారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని వెన్నెలపాలెం దుర్గమాంబ గుడికి వెళ్లే మార్గంలో తెగి కింద పడిన ఏపీఈపిడిసిఎల్ 11కేవి విద్యుత్ తీగ ఆవుకు తగలడంతో ఆవు మృతి చెందింది. తగిన నష్టం పరిహారం చెల్లించాలని పరవాడ ఏపీఈపిడిసిఎల్ అధికారులను ప్రజా ప్రతినిధులను బాధిత రైతు వెన్నెల కిత్తయ్య కోరుతున్నారు.



చనిపోయిన ఆవు వద్ద బాధితురాలు

ప్రవీణ్ పగడాల హత్యను నిరసిస్తూ శాంతి ర్యాలీ

ప్రజాశక్తి-రాంబిల్లి : మండలం పాస్టర్స్ ఫెలోషిప్, క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో క్రైస్తవ బోధకుడు ప్రవీణ్ పగడాల హత్యకు నిరసనగా రాంబిల్లిలో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు, మండల కమిటీ నాయకులు సంఘీభావం తెలియజేశారు. మైనార్టీలకు రక్షణ కల్పించాలని, మతోన్మాద దాడులు అరికట్టాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం మానవహారం చేపట్టారు. మండల తహశీల్దారు శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. క్రైస్తవ సంఘాల మండల అధ్యక్ష కార్యదర్శులు కె.జేమ్స్, జాషువారాయ్ మాట్లాడుతూ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపి దోషులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు వి.కాలేబు, సుధీర్ కుమార్, కృపారావు, పీటర్, సైమన్ పీటర్, రాజా పిన్నాస్ తదితరులు పాల్గొన్నారు.



మానవహారం చేస్తున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

కేన్సర్ పట్ల అవగాహన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్ర మెడికల్ కళాశాల మెడికల్ ఆంకాలజీ విభాగం ఆధ్వర్యంలో తొలిసారి డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు మెమోరియల్ ఓరియేషన్ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎస్ సంధ్యా దేవి, కెజిహెచ్ మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కేన్సర్ వైద్యులు డాక్టర్ రఘునాథరావు, ఆయన సతీమణి డాక్టర్ లీల కేన్సర్ వ్యాధి పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతన వైద్య విధానాలు, ఆధునిక అంశాలపై వైద్య విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఆంధ్ర మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థులు, ప్రవాసాంధ్రులు డాక్టర్ రవి శర్మ, డాక్టర్ శేషు శర్మ, దాతల సహకారంతో ఈ ఓరియేషన్ ప్రోగ్రాం చేపట్టారు. కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, ఎఎంసి పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.సుధాకర్ పాల్గొన్నారు.

బెల్లం ఆధారిత ఉత్పత్తులతో ఆదాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : బెల్లం విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీతో జిల్లా రైతులు మెరుగైన ఆదాయం పొందవచ్చని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సిహెచ్ ముకుందరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో శనివారం నిర్వహించిన టిఎస్పి సమావేశంలో డాక్టర్ సిహెచ్ ముకుందరావు మాట్లాడుతూ బెల్లం విలువ ఆధారిత ఉత్పత్తులైన బెల్లం చిన్న ముక్కలుగాను, బెల్లం పొడిగాను, బెల్లం చిరుధాన్యాలతో బిస్కెట్లు కేకులు వంటి పదార్థాలు తయారు చేయడం ద్వారా రైతులు ఎక్కువ ఆదాయం పొందవచ్చని తెలిపారు. పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ పివికే జగన్నాథం మాట్లాడుతూ విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేయడం ద్వారా చెరుకు రైతు కనీసంగా రూ.35 వేలు అదనంగా పొందవచ్చునని చెప్పారు. జిల్లా వ్యవసాయ శాఖ ప్రతినిధి పి.శ్రీధర్‌రావు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ తయారులో భాగంగా బెల్లం విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి శిక్షణ కార్యక్రమాలపై ప్రణాళిక తయారు చేస్తున్నామన్నారు. అనంతరం వివిధ మండలాల నుండి విచ్చేసిన వ్యవసాయ సహాయ సంచాలకులు జిల్లా వ్యవసాయ పరిస్థితులపై శాస్త్రవేత్తలతో చర్చించి తగిన సలహాలు సూచనలు పొందారు. ప్రాంతీయ పరిశోధన స్థానంలో ఎలమంచిలి 146 నువ్వు రకము సాగు పరిస్థితులు ప్రగతిపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ టి.శ్రీలత, డాక్టర్ పివికె జగన్నాధరావు, డాక్టర్ డి.ఉమామహేశ్వరరావు, డాక్టర్ ఎం.విశాలాక్షి, డాక్టర్ బి.భవాని, డాక్టర్ సిహెచ్ రామలక్ష్మి, డాక్టర్ ఎంబిజిఎస్ కుమారి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



క్షేత్ర సందర్శన చేసిన శాస్త్రవేత్తలు



సామాజిక తనిఖీ ప్రజావేదికలో ప్రశ్నిస్తున్న అధికారులు

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై డ్వామా పీడీ పూర్ణిమాదేవి ఆధ్వర్యంలో శనివారం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. పలు పంచాయితీల్లో నాటిన మొక్కల్లో సగానికి పైగా పెరగకపోవడం, కొన్నిచోట్ల మొక్కలు లేకపోవడంపై ఆమె ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రశ్నించారు. మస్టర్‌లో దిద్దుబాట్లు, సంతకాలు లేనట్లు గుర్తించి పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లకు జరిమానా విధించారు. జడ్పిటిసి దొండా రాంబాబు మాట్లాడుతూ మండలంలో పలు కార్యక్రమాలు నిర్వహించి సమయంలో ప్రోటోకాల్ పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆహ్వాన పత్రంలో జెడ్పీ చైర్పర్సన్ జె.సుభద్ర పేరు కూడా ఉండటం లేదన్నారు. ఇక్కడి అధికారులు తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నాగేశ్వరిదేవి, ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బూరే బాబురావు, ఎపిడి బి.శ్రీనివాసరావు, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ నిర్మలాదేవి, ఎంపిడిఓ విజయలక్ష్మి, పూర్వపు ఏపీఓ మురళీకృష్ణ, ఏపీఓ వరహాలబాబు, సర్పంచులు పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో ఉగాది వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఉగాది వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు మాగాయ చెక్కి పచ్చడి తయారీలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, వైస్ ప్రిన్సిపల్ గణేష్ ప్రసాద్ రెడ్డి, వివిధ విభాగాధిపతులు, డిఎల్‌సిసి కన్వీనర్ షైక్ షబీనా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వికలాంగుల పాఠశాలకు రూ.6 లక్షల విరాళం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అచ్యుతాపురం వికలాంగుల ఆశ్రమ పాఠశాల నిర్వహణకు శనివారం పరవాడకు చెందిన ఎస్ఎస్ఎఫ్ వాటర్ సైన్స్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రాజేంద్రన్ కుమరేషన్ చేతుల మీదుగా ఆరు లక్షల రూపాయలు విరాళాన్ని జాతీయ అవార్డు గ్రహీత పిఎస్‌టి పట్నాయక్‌కు అందజేశారు. శనివారం పాఠశాలను సందర్శించిన ఆయనకు తమ పాఠశాలకు రక్షణ కూడా లేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు ఆయన దృష్టికి విద్యార్థులు తీసుకురాగా, ఆయన స్పందించి ఆరు లక్షల రూపాయలు చెక్కును అందజేశారు

మెగా జాబ్ మేళాకు స్పందన

ప్రజాశక్తి-కె.కోటపాడు

స్థానిక అయ్యన్న విద్యాసంస్థల ప్రాంగణంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన జాబ్ మేళాను మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కె.కోటపాడులో నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గోవిందరావు మాట్లాడుతూ శనివారం నాటి జాబ్ మేళాలో 17 కంపెనీలు పాల్గొనగా వాటిలో అత్యధికంగా ఫార్మా కంపెనీలు ఉన్నాయని తెలిపారు. 800 నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. త్వరలో మరో 25 కంపెనీలతో మాట్లాడి భారీ జాబ్ మేళా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్, డైరెక్టర్ రొంగలి మహేష్, మాజీ సర్పంచ్ దొకల లక్ష్మీనరసింహమూర్తి, అయ్యన్న విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

నూకాంబిక జాతర మహోత్సవాలు ప్రారంభం

-రూ.10 కోట్లతో అమ్మవారి ఆలయం అభివృద్ధి : మంత్రి రవీంద్ర



పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి శ్రీనూకాంబిక అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. నూకాంబిక జాతరను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నూకాంబిక దేవాలయాన్ని రూ.10 కోట్లతో నిర్మాణం, అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. దేవాలయం అభివృద్ధి, కల్పిస్తున్న సౌకర్యాలు మూలంగా భవిష్యత్తులో ఎక్కువ మంది భక్తులు వస్తారని, అనకాపల్లి పర్యాటకంగా కూడా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు, ఎపియుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఎపి గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, కొప్పులవెలమ కార్పొరేషను చైర్మన్ పివిజి.కుమార్, ఆలయ చైర్మన్ పీలా నాగశీను, టిడిపి నేత దాడి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర సందర్భంగా దాడి వీరు నాయుడు కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఆ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ఆదేశాల మేరకు గవరపాలెం సంత బయలు వద్ద భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కోరిబిల్లి రమేష్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్సార్ జమీర్, జి.సత్తిబాబు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ పండగ

కె.కోటపాడు : నూకాంబిక అమ్మవారి పండగను మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దాలివలస జరిగిన నూకాంబిక జాతరలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. చౌడువాడలో విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ ఆధ్వర్యంలో జరిగింది.

సబ్బవరం : సబ్బవరం పంచాయతీ శివారు పెదనాయుడుపాలెం, గుల్లేపల్లి, గాలి భీమవరం శివారు జాగరవానిపాలెం, జీవీఎంసీ 88వ వార్డ్ కోటనరవ గ్రామాలలో కొత్త అమావాస్య నూకాలమ్మ తల్లి పండగ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. జిల్లా తెలుగు యువత అధ్యక్షులు పిబివిఎస్ఎన్.రాజు, మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్, వైసిపి నేత గండి రవికుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, నాయకులు లక్ష్మణ, కర్రి బాబు, సబ్బవరపు నాగేంద్ర, సిరికి దేవుడు పాల్గొన్నారు.

పరవాడ : మండల కేంద్రం పరవాడలో నూకాంబిక అమ్మవారి పండుగ మహోత్సవ సందర్భంగా ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ పైల అప్పారావు, నాయకులు రెడ్డి శ్రీనివాస్‌రావు, చల్ల కనకారావు తదితరులు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారు మెట్ట, వడ్డాది గ్రామాల్లో నూకాంబిక అమ్మవారి ఆలయాల్లో భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమ, చీర, జాకెట్లు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాజాం, విజయరామరాజు పేట, కోమల్లపూడి, గ్రామాల్లో కొత్త అమావాస్య వేడుకలు ఘనంగా జరిగాయి.

నక్కపల్లి : మండలంలోని ఉపమాక గ్రామంలో శుక్రవారం రాత్రి నూకాలమ్మ తల్లి ప్రతిమలు (గరగలను) డప్పుల వాయిద్యాలతో ఊరేగించారు. శనివారం ఉదయం తాటి చెట్ల పేడలను పాతి వాటికి తాడుకట్టి ఊయలను తయారు చేసారు. ఈ ఊయలపై అమ్మవారి ప్రతిమలను కూర్చోండబెట్టి ఉయ్యాల సేవను సందడిగా నిర్వహించారు. రామాలయం వద్ద యువకులు, పిల్లలతో నాగళి లాగించి దుక్కు దున్నే తంతు నిర్వహించారు. ఉపమాక, రాజయ్యపేట, పెదతీనార్ల, అమలాపురం, డి.ఎల్.పురం, రమణయ్యపేట, ఎన్.నర్సాపురం, బంగారమ్మపేట, గొడిచెర్ల, డొంకాడ, దేవవరం తదితర గ్రామాల్లో అమ్మవారి ఆలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి.

కోటవురట్ల : మండల కేంద్రంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కైలాసపట్నం, తంగేడు, రాజుపేట, గొట్టువాడ, పొందూరులో సందడి నెలకొంది.

నర్సీపట్నం టౌన్ : మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో నూకాలమ్మ అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గజాల నాగరత్నం, వైస్ ఎంపిపి ఇస్సం రత్నం రమణ, జనసేన నేత ఊడి చక్రవర్తి దంపతులు, రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు అమ్మవారిని దర్శించుకున్నారు.

మాడుగుల : మాడుగులతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో నూకాంబిక అమ్మవారి పండుగను ఘనంగా జరుపుకున్నారు. దేవాలయాల వద్ద అన్న సమారాధన ఏర్పాటు చేశారు. మాడుగులలో బైరు ఎడ్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు.

సమానత్వం లేని ఆక్సిజన్ టవర్స్‌లోకి డెలివరీ ఇవ్వలేం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

నగరంలోని ఆక్సిజన్ టవర్స్‌లో సమానత్వం చూపిస్తేనే డెలివరీ ఇస్తామని, లేకపోతే ఇవ్వలేమని ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా అధ్యక్షులు బి.జగన్ స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డెలివరీ బాయ్ ఆక్సిజన్ టవర్స్‌పైకి వెళ్లడానికి చెత్తాచెదారం, కుక్కలను తీసుకెళ్లే లిఫ్ట్‌లో వెళ్లాలన్న నిబంధన అమల్లో ఉందన్నారు. ఇది వివక్షతో కూడుకున్నదని తెలిపారు. ఇటువంటి వివక్ష చూపిస్తున్న ఆక్సిజన్ టవర్స్‌కు తాము డెలివరీ ఇవ్వబోమన్నారు. గౌరవం లేని దగ్గర డెలివరీ ఎలా ఇవ్వగలమని ప్రశ్నించారు. మీడియా సమావేశంలో ఆక్సిజన్ టవర్స్ అసోసియేషన్ వారు డెలివరీ ఇవ్వాలని కోరడం జరిగిందన్నారు. అయితే వారు చెప్పినదానికీ, ఆచరణకూ ఎంతో తేడా ఉందన్నారు. డెలివరీ బాయ్స్‌ను టవర్స్‌లో రెండో తరగతి పౌరులుగా చూస్తున్నారని, ఇది చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, సిపి జోక్యం చేసుకోవాలని, వివక్షకు గురిచేస్తున్న వారిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మిగతా వారికి డెలివరీ ఇవ్వడానికి ఇంటి దగ్గర ఎక్కువలో ఎక్కువ ఒక బాయ్‌కు రెండు నుండి మూడు నిమిషాలు పడుతోందని, ఆక్సిజన్ టవర్స్‌లో మాత్రం డెలివరీ ఇవ్వడానికి కనీసం 45 నిమిషాలు పడుతోందని తెలిపారు.

ఘనంగా ఉగాది సంబరాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : షడ్రుచులతో జీవిత పరమార్థం చెప్పే పండగ ఉగాది అని ఎపిఇపిడిసిఎల్ మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.సింహాద్రి రాజు అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం స్థానిక సేవా కేంద్రాల ఆధ్వర్యంలో శనివారం హెచ్‌బి కాలనీ ఎపిఎస్ఇబి పార్కు కమ్యూనిటీ హాల్‌లో ఉగాది సంబరాలు సంప్రదాయబద్ధంగా జరిగాయి. సింహాద్రి రాజు, విశాఖ సమాచారం దినపత్రిక అధినేత సూరంపూడి వీరభద్రరావు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, కన్సర్న్ ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పీకే జోష్ హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. సీనియర్ జర్నలిస్టు, విశ్వచిత్రకళ ఎడిటర్ జగన్మోహన్‌ను సన్మానించారు. కొరియోగ్రాఫర్, సీనియర్ జర్నలిస్టు నాగరాజు పట్నాయక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బ్రహ్మకుమారీస్ ప్రతినిధి రామేశ్వరి, సత్యవతి పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి-కశింకోట : విద్యార్థులు అభివృద్ధికి మరింత కృషి అవసరమని రాష్ట్ర మోడల్ స్కూల్ అకడమిక్ మోనటరింగ్ అధికారి కె.ధర్మకుమార్ అన్నారు. మండలంలోని తేగాడ మోడల్ స్కూల్‌ను శనివారం ఆయన సందర్శించారు. రికార్డులు, పాఠశాల గదులను పరిశీలించారు. 6వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా చూడాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఐ.మార్తా తిలకం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ధర్మకుమార్

మసీద్‌లో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం చింతలపాలెం సయ్యద్ జాఫర్ మసీదులో శనివారం ఇఫ్తార్ విందు కన్నూరుపాలెం మసీద్ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. షేక్ రెహమాన్, మసీద్ ఇమం కురాన్ గౌస్ కురాన్ చదివాన్ అల్లా గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో మసీద్ ప్రెసిడెంట్ ఎస్‌కే బాబ్జి, ఎస్‌కె ఇస్మాయిల్, ఎస్కే మదీనా, మల్లేష్ షేక్ రెహమాన్ అబ్దుల్ పాల్గొన్నారు.

బుదిరెడ్లపాలెంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం కోమలపూడి శివారు బుదిరెడ్లపాలెంలో పూడిక పోయిన కాలువలను స్థానిక మహిళలు శుభ్రం చేయడం, దీనిపై క్షీణించిన పారిశుధ్యం అనే శీర్షిన ప్రజాశక్తి వార్తను ప్రచురించడంతో పంచాయతీ అధికారులు స్పందించారు. శనివారం పంచాయతీ కార్యదర్శి సింహాద్రి ఆధ్వర్యాన కార్మికులు గ్రామంలో కాలువల్లోని పూడిక తొలగించారు. వాటర్ ట్యాంక్ లోపల పట్టిన తాచును శుభ్రం చేశారు. పురవీధుల్లో బీజింగ్ చల్లించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సింహాద్రి మాట్లాడుతూ సోమవారం వీధిలైట్లు వేస్తామన్నారు. ప్రతి రోజు రెండు పూటలా పంచాయతీ నీరు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సచివాలయ పరిధిలో రెండు గ్రామాల్లో అధిక జనాభా కావడంతో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేయలేకపోతున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమస్యను వెలికి తీసిన ప్రజాశక్తికి ధన్యవాదాలు తెలిపారు.



కాలువలు శుభ్రం చేసి బీచింగ్ వేస్తున్న దృశ్యం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఆర్గనైజేషన్ సభ్యులు

బాధితునికి రూ.10 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లికి చెందిన లోడ వెంకట రమణ గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ మేరకు స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సభ్యులు స్పందించి ఆయనకు 10 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు చిట్టియ్య, శివ, నాగేష్, పల్లా కృష్ణ, రమణ పాల్గొన్నారు.

మైనింగ్ మాఫియా అక్రమాలపై దర్యాప్తు చేయాలి

- సిపిఎం ఆధ్వర్యాన నిరసన



నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు, గిరిజనులు

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలంలోని మైనింగ్ మాఫియా అక్రమాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్‌తో దర్యాప్తు చేయాలని, మైనింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలంలో రోలుగుంట, కొవ్వూరు, వెదురువలస, నిండుగొండ, కంచుగుమ్మల, వడ్డిప, శరభవరం, నాయుడుపాలెం గ్రామాల్లో 2007 సంవత్సరం నుండి 34 నల్లగా క్వారీలు ఉన్నాయన్నారు. వీటిలో లీజు ఫీడ్ ఉన్న ఏడు క్వారీలు మాత్రమేనన్నారు. ఐదు నల్లరాయి పర్యావరణ అనుమతులు మాత్రం ఉన్నాయన్నారు. మిగిలి ఉన్న క్వారీలకి ఎటువంటి అనుమతులు లేవన్నారు. ఈ క్వారీ ప్రభావత గ్రామాల్లో 25వేల మంది జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రధానంగా ఈ గ్రామాల్లో ఫ్లోరైడ్ గ్రామాలుగా ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. రోలుగుంట మండల కేంద్రంలో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణం చేశారని, వినియోగంలోకి తీసుకురాలేదని పేర్కొన్నారు. 2020 సంవత్సరంలో కంచుగుమ్మల రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 1 రాయిని తవ్వడంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ జిల్లా అధికారి దర్యాప్తు చేసి క్వారీకి 5 కోట్ల 68 లక్షల 48 వేల 980 రూపాయలు పెనాల్టీ వేశారన్నారు. క్వారీ యజమాని రాజకీయ పలుకుబడి ఉపయోగించుకొని 25 లక్షల రూపాయలు మాత్రమే చెల్లించారని చెప్పారు. క్వారీల్లో పేలుళ్లతో ప్రభావత గ్రామాల్లో ఇల్లు దెబ్బతింటున్నాయని తెలిపారు.. నేలబావులు ఇంకుపోతున్నాయని, నీరు కలుషితం అవుతుందని చెప్పారు. గ్రామస్తులు పశువులు మేపుకోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2023 సంవత్సరంలో పర్యావరణ అనుమతుల కోసం ఐదు నల్ల క్వారీలకు గ్రామ సభలు నిర్వహించారని, అనుమతులు ఇవ్వకూడదని అనేకమంది గ్రామస్తులు వ్యతిరేకించారని తెలిపారు. రాజకీయ అండదండలతో పర్యావరణాన్ని అనుమతులు పొందారని చెప్పారు. ఒక గ్రామానికి సిఎస్ ఆర్ ఫండ్స్ ఖర్చు పెట్టలేదన్నారు. క్వారీ వాహనాలతో రోడ్లన్నీ ధ్వంసం అయి పోతున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న మైనింగ్ కంపెనీలపై సమగ్రమైన దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాంగి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

1న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి ఆర్సీఎం పాఠశాలలో 1995 వరకు చదివిన 27 బ్యాచులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఏప్రిల్ 1వ తేదీన నిర్వహించనున్నట్లు ఈ కార్యక్రమ ఆర్గనైజర్ పి.ప్రకాశరావు తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతోమంది ఈ పాఠశాలలో చదివి ఉన్నత స్థానంలో నిలిచారన్నారు. అటువంటి పాఠశాల మూతపడడం చాలా బాధాకరమని తెలియజేశారు. ఈ పాఠశాల అభివృద్ధి పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో ప్రారంభమవుతుందని తెలియజేశారు.



పురస్కారం అందుకుంటున్న నాగజ్యోతి

నాగజ్యోతికి ఉగాది పురస్కారం

ప్రజాశక్తి-రోలుగుంట:విశ్వా వసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో సృజన ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు రంగాలలో విశిష్ట ప్రతిభ చూపిన కళాకారులకు ఉగాది పురస్కారాలు ఇచ్చారు. ఇందులో భాగంగా రోలుగుంట హైస్కూల్ ఉపాధ్యాయురాలు, క్రీడాకారిణి పివిఎం.నాగజ్యోతికి ఉగాది పురస్కారం అందజేశారు.

టిడిపి సీనియర్ నేత శేషు కుమార్ మృతి



నివాళి అర్పిస్తున్న స్పీకర్ దంపతులు

ప్రజాశక్తి -కోటవురట్ల:మాకవరపాలెం టిడిపి సీనియర్ నాయకులు, మాజీ జెడ్పిటిసి సభ్యులు రుత్తల శేషు కుమార్ శనివారం ఉదయం కాలేయ సంబంధం వ్యాధితో మృతి చెందారు. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన నామినేట్ పదవుల్లో భాగంగా నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. పదవి బాధ్యతలు చేపట్టకముందే మృతి చెందడంతో నియోజకవర్గ వ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. 25 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో అనేక పదవులు చేపట్టారు, మకవరపాలెం గ్రామ సర్పంచిగా, జడ్పిటిసి సభ్యులుగా, ఎంపిటీసీ సభ్యులుగా పదవులు చేపట్టారు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా సుదీర్ఘకాలం పనిచేసిన ఆయన అకాల మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు, సహ టిడిపి పార్టీ రాష్ట్ర కార్యదర్శి విజయ్, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్, ఎంపిపి సర్వేశ్వరరావు సంతాపం ప్రకటించారు.మండల కేంద్రంలో గల దుకాణ సముదాయాలు మూసివేశారు.



విచారణ చేపడుతున్న అధికారులు

కొలిక్కిరాని రెవెన్యూ సమస్యలు

ప్రజాశక్తి-కోటవురట్ల:తహసిల్దార్ కార్యాలయంలో శనివారం పిజిఆర్ఎస్ ఫిర్యాదులు, భూ సమస్యల పరిష్కారంపై నిర్వహించిన సమావేశంలో రెవెన్యూ సమస్యల పరిష్కారంపై కొలిక్కి రాలేదు. మండల కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు జల వనరుల శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, స్థానిక తహసీల్దార్ తిరుమల బాబు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఐదు గ్రామాలలో ఆరు సమస్యలపై కమిటీ సభ్యులు ఫిర్యాదుదారులతో చర్చించారు, రామచంద్రపురం 96 సెంట్లు పై అక్కాచెల్లెళ్ల వివాదం, కోటవురట్ల పూర్వీకులు ఉప్పరి కులానికి చెందిన గుర్రం గోవిందా వర్గాలు, పులపర్తి పద్మావతి భూవివాదం, చౌడవాడ గ్రామంలో కరెట్ల పెద అప్పారావు, కోలా సతీష్‌కు చెందిన స్థల వివాదం, ఎల్లపు సత్యనారాయణ, మరియు పరసన్న చెందిన విభాగంతో పాటు, జగ్గంపేట గ్రామానికి చెందిన 5.16 ఎకరాల వివాదం కూడా కమిటీలో చర్చించారు. చర్చల అనంతరం వచ్చే నెల 19 కు వాయిదా వేసినట్లు తహసిల్దార్ తిరుమల బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి -రావికమతం:కార్పొరేషన్ల రుణాలకు సంబంధించిన ఇంటర్వ్యూలు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఎంపీ డీవో వెంకన్న బాబు, యూనియన్ బ్యాంకు, ఏపీజీబీ బ్యాంకు అధికారుల ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, బీసీ, ఈబీసీ, వైశ్య, కమ్మ, రెడ్డి, క్షత్రియ,బ్రాహ్మణ, కార్పొరేషన్ల ఇంటర్వ్యూలకు 585 మంది దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. వారిలో శనివారం 65 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు పూర్తి చేశామని తెలిపారు.



ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

చీరల పంపిణీ

ప్రజాశక్తి -పద్మనాభం : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు రూపాకుల విశాలాక్షి 99వ జయంతి సందర్భంగా మండలంలోని పాతకోవాడ గ్రామం రామాలయం వద్ద పేద మహిళలకు చీరలు, పండ్లు శనివారం పంపిణీ చేశారు. శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, బిజెపి, ప్రకృతి చికిత్సాలయం సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.ఆనందరావు ముందుగా విశాలాక్షి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, సాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ పిలుపునందుకొని విశాలాక్షి కుటుంబ సభ్యులు ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా, హరి జనోద్ధరణ, సర్వోదయ ఉద్యమాల్లో కీలక పాత్ర వహించి జైలు శిక్ష అనుభవించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్, తమటపు నాగమణి, విశాలాక్షి కుటుంబ సభ్యులు, శిష్టా శ్రీలక్ష్మి, గూడా మైధిలి, జెవి శ్రీధర్, జయంతి, శేష అన్నపూర్ణ, మౌనిక , శిష్టా మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఆర్ఐటి వార్షికోత్సవం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం నడింపల్లి సత్యనారాయణ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఎస్ఆర్ఐటి) 14వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గ్లోబల్ పీపుల్ ఆపరేషన్స్ సీనియర్ డైరెక్టర్ అర్వింద్ మాధుర్, హెచ్‌పిసిఎల్ జనరల్ మేనేజర్ వివి.రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నాణ్యమైన ఇంజినీరింగ్ విద్యను అందించడమే కాకుండా, వృత్తి నైపుణ్యాలను పెంపొందించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్ది ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. కళాశాల అభివృద్ధికి ఎనలేని సేవలందించిన దీర్ఘకాల అధ్యాపకులను అభినందించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవల అందించిన ఉపాధ్యాయులకు 'విశిష్ట సేవా పురస్కార్', 'సేవా పురస్కార్'లను అందజేశారు. అకడమిక్ ఎక్సెలెన్స్ ప్రదర్శించిన విద్యార్థులను బహుమతులు, ధ్రువపత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో 3,000 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ఎస్.శంభుప్రసాద్, సిఎంఒ పిఎస్.రాజు, కార్యదర్శి ఎన్.ప్రసాదరాజు, ఛైర్మన్ నడింపల్లి సత్యనారాయణరాజు, ఇండస్ట్రియల్ హెడ్ నవీన్, ఎన్ఎస్ఎస్ పిఒ హరినాథ్, పిఇటిలు పాల్గొన్నారు.

వార్డు సమస్యలపై వినతి

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి 5వ వార్డు సమస్యలపై ఆ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత శనివారం ఇన్‌ఛార్జి కమిషనర్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. వార్డులో యుజిడి, తాగునీరు, వీధిదీపాల సమస్య ఎక్కువగా ఉందని, 15వ ఆర్థిక సంఘం నిధులతో సాయిరాం కాలనీలో నిర్మిస్తున్న తాగునీటి స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయని, ఆ పనులు చేపట్టాలని, పరదేశిపాలెం, బోరవానిపాలెం, కొత్తపాలెం, సాయిరాం కాలనీలలో శ్మశాన వాటికల అభివృద్ధి పనులు చేపట్టాలని, బొట్టవానిపాలెం, నగరంపాలెం చెరువులను అభివృద్ధి చేయాలని జివిఎంసి కౌన్సిల్లో హరేంధిరప్రసాద్‌కు వినతిపత్రం అందించినట్లు ఆమె తెలిపారు. సమస్యల పరిష్కారానికి తొందర్లోనే చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారని ఆమె పేర్కొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

అర్జీలను పరిష్కరించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రజల నుంచి వచ్చిన అర్జీలు పెండింగ్ లేకుండా సత్వరం పరిష్కరించాలని మండల ప్రత్యేక అధికారి పి ప్రసాద్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంఎంఎల్‌సిసి సమావేశం నిర్వహించారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు నరసింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, సర్వేయర్ సత్తిబాబు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించరూ..

-16 కిలోమీటర్లు పాదయాత్ర చేసిన గిరిజనులు

ప్రజాశక్తి - మాడుగుల :మండల పరిధి శంకరం పంచాయతీలోని గిరిజన గ్రామాలైన తాడివలస, గొప్పూరు, రాయిపాలెం, రాజంపేట, వెలగపాడు, కొత్తవలస, మామిడిపాలెం గ్రామాల్లో రోడ్డు సౌకర్యం కల్పించాలని, కొత్తవలస - తాడివలస గెడ్డలపై బ్రిడ్జిలు నిర్మించాలని కోరుతూ ఏడు గ్రామాలకు చెందిన గిరిజనులు కృష్ణంపాలెం గొప్పూరు నుంచి మండల కేంద్రం వరకు 16 కిలోమీటర్లు మేర మండుటెండలో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయం ఎదుట మోకాళ్లపై కూర్చొని ధర్నా చేపట్టారు. 'పవన్ కళ్యాణ్ బాబూ.. మా గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించరూ' అంటూ చేతులెత్తి నమస్కరిస్తూ వేడుకున్నారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పాదయాత్రనుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, నాయకులు కె.భవాని, బిటి.దొర మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఈ గ్రామాలకు రోడ్ల సౌకర్యం కల్పించనున్నట్లు, రూ.9 కోట్ల 30 లక్షలతో బ్రిడ్జిలు సైతం నిర్మించనున్నట్లు తెలిపారన్నారు. ఎన్నికల్లో టిడిపి కూటమి గెలుపు అనంతరం ఆ సమస్యలను పట్టించుకోలేదన్నారు. వర్షం వచ్చే సమయంలో గెడ్డలు దాటలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గర్భిణులు, బాలింతలను డోలీలు కట్టి మోసుకు వస్తున్నారని తెలిపారు. విద్యార్థులు, వృద్ధులు పడుతున్న కష్టాలను తెలియజేశారు. గొట్టివాడ నుంచి కొత్తవలస, వెలగలపాడు, గొప్పూరు, తాడివలస, రాయిపాలెం, రాజంపేట మీదుగా కృష్ణంపాలెం తారు రోడ్డు వరకూ రహదారి సౌకర్యం కల్పిస్తే గిరిజనుల కష్టాలు తీరుతాయన్నారు. గత ఏడాది కొత్తవలస గెడ్డ దాటలేక, 108 అంబులెన్స్ రాక ఒక నిండు ప్రాణం బలైందని గుర్తుచేశారు. తాడివలస గెడ్డ దాటలేక గర్భిణి ఆ గెడ్డ మధ్యలోనే ప్రసవించిందని తెలిపారు. ఇటువంటి ఘటనలు నిత్యకృత్యమవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనపరెడ్డి నూకరాజు, గొట్టూరి అప్పారావు, గిన్నెపల్లి సన్యాసమ్మ, సూమర్ల చంటి, గురువుల కృష్ణమూర్తి పాల్గొన్నారు.


పాదయాత్ర నిర్వహిస్తున్న గిరిజనులు


వర్మీ కంపోస్ట్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని వేంపాడులో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి పి.ప్రసాద్ శనివారం ఎంపీడీవో డి సీతారామరాజుతో కలిసి పరిశీలించారు. సేకరించిన తడి పొడి చెత్త, వర్మి కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలన చేశారు. గ్రీన్ అంబాసిడర్‌లకు చెత్త సేకరణ పై పలు సూచనలు చేశారు. గ్రామంలో పర్యటించి ఇంటింటా తడి పొడి చెత్త సేకరణ పై అవగాహన కల్పించారు. చెత్త రహిత గ్రామాలుగా తీర్చి దిద్దాలన్నారు. కుళాయిలు ద్వారా తాగునీరు సక్రమంగా సరఫరా కాలేదని కాలనీవాసులు ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకెళ్లడంతో, వెంటనే ఆయన స్పందించి ఏఈతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఈవోపీఆర్డి ఎం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



చెక్కతో కలశం, మామిడి తోరణం, కోకిల

సూక్ష్మ కళాకారుని ప్రతిభ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి ఉగాది, తెలుగు సంవత్సరాన్ని పురస్కరించుకొని తన సూక్ష్మ కళను ప్రదర్శించాడు. ఉగాది సందర్భంగా చెక్కతో కలశం, మామిడి ఆకులు, కోకిలను చెక్కి, తెలుగు సంస్కృతి ఉట్టిపడే విధంగా తన సూక్ష్మ కళను పరిష్కరించాడు. తన సూక్ష్మకళతో తెలుగు సంవత్సరానికి స్వాగతం పలుకుతూ, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపాడు.



సర్టిఫికెట్ ఇస్తున్న నిర్వాహకులు

శాప్ కోచ్ అబ్బుకు సర్టిఫికెట్ ప్రదానం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన పాటియాలా పంజాబ్‌లో గత వారం రోజులుగా నిర్వహించిన ఆల్ ఇండియా కోచ్ రిఫ్రెష్ కోర్సులో శాప్ కోచ్ అబ్బు సర్టిఫికేట్ అందుకున్నారు. ఈ కోర్సులో ఆల్ ఇండియా వివిధ రాష్ట్రాల నుండి 26 మంది పాల్గొన్నారు. ఇందులో భాగంగా ద్రోణాచార్య అవార్డ్ గ్రహీత చంద్రలాల్ (హర్యానా ఖేలో ఇండియా ఎక్సలెన్సీ మేనేజర్) 29న పాటియాలా పంజాబ్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సెంటర్‌లో శనివారం సర్టిఫికెట్ అందజేశారు. ఇంటర్నేషనల్ కోచ్ అబ్బు ఇప్పటికే బాక్సర్లను నేషనల్ ఇంటర్నేషనల్ స్థాయికి తీసుకువెళ న్నారు. ఈ మేరకు నర్సీపట్నం నింజాస్ అకాడమీ, నేషనల్ స్పోర్ట్స్ అకాడమీ కోచ్‌లు, డైరెక్టర్స్ చైర్మన్ వెలగా నారాయణరావు, సుతాపల్లి శ్రావణ్ సుతాపల్లి శ్రీకాంత్, ఎన్ఆర్ఐ సురేష్, సీనియర్ కోచ్ యర్రా శేఖర్ అభినందించారు.

షాపుల వేలంపాట వాయిదాపై నిరసన

ప్రజాశక్తి- మాడుగుల:మాడుగులలో ఉన్న పంచాయతీ షాపుల వేలంపాట మరోసారి వాయిదా వేయడంతో, డిపాజిట్ దారులు పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కార్యదర్శి, పాలవర్గానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు.అనంతరం మాడుగుల పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు పాటదారులు తెలిపిన వివరాలు..మాడుగుల పంచాయతీ పరిధిలో షాపింగ్ కాంప్లెక్స్ 1,2 లో ఉన్న 30 షాపులకు సంబంధించి ఈ నెల 28వ తేదీ శుక్రవారం వేలంపాట నిర్వహించేందుకు టెండర్ ప్రకటన ఇచ్చారు. దీనికి సంబంధించి 114 మంది షాపులు పాడుకునేందుకు వెయ్యి రూపాయల చొప్పున డిపాజిట్ చేశారు. 28న ..జరిగిన వేలంపాటలో పాలకవర్గం కలుగజేసుకొని పాట లేకుండా ఇప్పటివరకు ఉన్న దుకాణదారులకు మళ్లీ షాపులు ఇవ్వాలని పట్టుబట్టడంతో డిపాజిట్ దారులు, పాలకవర్గ సభ్యుల మధ్య వాగ్వాదం జరగడంతో పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబు ఈ నెల 29వ తేదీ వాయిదా వేసిన సంగతి తెలిసిందే. శనివారం మధ్యాహ్నం పాట నిర్వహించాల్సి ఉండగా, పాలకవర్గం తీర్మానం మేరకు వేలంపాట వాయిదా వేశామని కార్యాలయం బయట నోటీస్ బోర్డులో అతికించారు. డిపాజిట్ దారులు దీన్ని చూసి కార్యదర్శి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పంచాయతీ కార్యాలయం ఎదుట బైటాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, బహిరంగ వేలంపాట నిర్వహించేందుకు టెండర్ ప్రకటన ఇచ్చి డిపాజిట్ కట్టించి చుకున్న కార్యదర్శి పంచాయతీ ఆదాయానిక గండికొట్టే విధంగా పాలకవర్గం చేసిన తీర్మానాన్ని పరిగణంలోకి తీసుకొని వేలంపాట వాయిదా వెయ్యడం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుతం షాపుల్లో ఉన్న వ్యాపారులకే మళ్లీ ఆ షాపులు కేటాయించి అద్దెపై 10శాతం పెంచి అద్దె తీసుకోవాలని పాలకవర్గం సభ్యులు తీర్మానం చెయడం ఏమిటని ప్రశ్నించారు. డిపాజిట్ దారులు పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గంపై మాడుగుల పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశారు. దీనిపై డీపీవో, జిల్లా కలెక్టర్ కి పిర్యాదు చేస్తామన్నారు.

ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మూర్తి బాబుని వివరణ కోరగా పంచాయతీ పాలకవర్గం ఇచ్చిన తీర్మానం ప్రకారం వేలంపాట నిరవధికంగా వాయిదా వేయడం జరిగిందని తెలిపారు.


నిరసన చేపడుతున్న వేలం పాటదారులు

గేట్ ర్యాంకర్ అశోక్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి రావికమతం:జాతీయస్థాయిలో నిర్వహిం చిన గేటు పరీక్షల్లో 12వ ర్యాంకు సాధించిన మండలంలో మర్రివలస గ్రామానికి చెందిన అమ్మిరెడ్డి అశోక్‌ను రావికమతం మండలం వైయస్సార్సీపీ మండల కన్వీనర్ కంచిపాటి జగన్నాధరావు శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా జగన్నాధరావు మాట్లాడుతూ, భవిష్యత్తులో ఉన్నతమైన శిఖరాలకు అశోక్ ఎదగాలని, మన ప్రాంతానికి, మన మండలానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో మర్రి వలస ఎంపీటీసీ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.


సత్కరిస్తున్న జగన్నాధరావు

గ్రూప్ హౌస్ సెల్లార్‌లో అగ్ని ప్రమాదం

-13 మోటార్ బైక్‌లు దగ్ధం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:నగరంలోని డాబా గార్డెన్స్, సింగ్ హోటల్ జంక్షన్, విశ్వనాథ రోడ్ లో ఉన్న గ్రూప్ హౌస్ సెల్లార్‌లో శనివారం తెల్లవారు జామున నాలుగు గంటల ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో 13 మోటార్ బైక్‌లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇవి కాకుండా గ్రూప్ హౌస్ కు వెలుపల రోడ్డుపై పార్క్ చేసిన మరో రెండు బైక్‌లు స్వల్పంగా అగ్ని ప్రమాదానికి గురై నష్టం జరిగింది. సెల్లార్‌ను అనుకొని ఉన్న మొదటి గృహంలో నివసిస్తున్న వేలుల గుప్త ఇంటిలోకి మంటలు వ్యాపించి ఇంటిలో ఉన్న ఫర్నిచర్, టీవీ, ఫ్రిడ్జ్, ఫ్యాన్స్, ట్యూబ్ లైట్లు, బల్బులు దగ్ధమయ్యాయి. గ్రూప్ హౌస్ సెల్లార్ భాగం అంతా మంటలకు చాలావరకు దెబ్బతింది. స్థానికులు మంటలు ఆర్పేందుకు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఫలితం దక్కలేదు.

ఇది ఇలా ఉండగా, సుమారు నెల రోజుల క్రితం ఇదే గ్రూప్ హౌస్ కు ఎదురుగా రోడ్డుపై పార్కు చేసి ఉన్న రెండు వాహనాలను దుండగులు దగ్ధం చేశారు. ఇందులో ఒక వాహనం యజమాని గ్రూప్ హౌస్ లో నివసిస్తున్నారు. వారం రోజుల క్రితం ఆయన కొత్త బైక్ కొనుగోలు చేశారు. దానిని రోడ్డుపై కాకుండా, గ్రూప్ హౌస్ సెల్లార్ లో భద్రపరిచారు. ఈ నేపథ్యంలో మరోసారి ఇక్కడ భారీ స్థాయిలో బైక్స్ దగ్ధం కావడం బట్టి చూస్తుంటే కక్షతోనే దుర్మార్గపు చర్యలకు పాల్పడి ఉంటారని టూ టౌన్ పోలీసులు భావిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు సాగుతున్నట్లు తెలిసింది.


దగ్ధమైన బైక్‌లు

యూత్ పార్లమెంట్‌కు ముగ్గురు ఎంపిక

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:జాతీయ స్థాయి యూత్ పార్లమెంట్ కు విశాఖపట్నం నోడల్ ఏజెన్సీ నుండి ముగ్గురు విద్యార్థినిలు ఎంపికైనట్లు నెహ్రూ యువ కేంద్ర యువ అధికారి జి.మహేశ్వరరావు మీడియాకు తెలిపారు. జ్యోత్స్న, లాస్య, శివాని ఈ ముగ్గురు వచ్చే నెలలో జరిగే జాతీయ స్థాయి యువ పార్లమెంట్‌లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తొమ్మిది నోడల్ ఏరియాలో ప్రాథమిక స్థాయి ఎంపిక నిర్వహించి ఒక్కొక్క ప్రాంతం నుంచి 10 మంది చొప్పున రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో ఈ నెల 28న నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో 90 మంది విద్యార్థులు పాల్గొన్నారని, రాష్ట్రం నుంచి కేవలం ముగ్గురికే మాత్రమే జాతీయ స్థాయి పోటీలకు అవకాశం ఉండగా ఆ ముగ్గురు విశాఖపట్నం నోడల్ ఏరియా నుంచి ఎంపిక అయ్యారని మహేశ్వరరావు తెలిపారు.


పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

ఎ.ఎల్.పురంలో కల్వర్టు నిర్మాణాలు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్. పురం గ్రామ పలు వీధుల్లో కల్వర్టుల నిర్మాణ పనులు చేపట్టినట్లు సర్పంచ్ లోచల సుజాత విలేకరులకు తెలిపారు. గత గ్రామ సభ, పంచాయతీ సాధారణ సమావేశాలలో గ్రామస్తులు వీధి రోడ్ల సమస్యపై వినతి పత్రాలు ఇచ్చారన్నారు. ఈ మేరకు పంచాయతీ నిధులతో అత్యవసర సిసి రోడ్లు, కల్వర్టుల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు.

1న శత శాతం పింఛన్లు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:ఏప్రిల్ 1వ తేదీన పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి, శతశాతం పంపిణీ చేయాలని ఎంపీడీవో డి.సీతారామరాజు సూచించారు. మండల పరిషత్ సమావేశంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సీతారామరాజు మాట్లాడుతూ పెన్షన్ దారులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, ఇన్చార్జి ఇఒపిఆర్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

Advt. Feature

ప్రజాశక్తి

శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది ప్రత్యేక అనుబంధం

ఆదివారం 30-03-2025 | విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాలు | 8 పేజీలు



తెలుగువారి జీవనాడి..

ప్రజాశక్తి - విశాఖపట్నం

ఉగాది

- ప్రకృతి పండగగా పేరు
- శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ఆగమనం నేడే

ఆకులన్నీ రాలిపోతాయి. చెట్లన్నీ మోడు వారతాయి. రాలిన ఆకులు ఎండిపోయి, గాలివాటుకు అటోఇటో ఎగిరి పోతూ ఉంటాయి. అది శీతల శిశిరం మిగిల్చిన కోల్పోయిన దృశ్యం. అదేచోట - మోడువారిన చెట్ల కొమ్మల్లో కొత్త చివుళ్లు తొంగిచూస్తాయి. లేలేత ఆకులు నవనవ లాడుతూ పరవశిస్తాయి. గుబురు కొమ్మల్లోంచి గండు కోయిల కూహూకూహూ గానం వినిపిస్తుంది. ఇది వసంతం తీసుకొచ్చిన ఆశావహ దృశ్యం. ఒక శోభ అదృశ్యమైన చోట- మరొక ఆశ అవతరిస్తుంది. ఆకు రాలిన చోట కొత్త చివురు పలకరిస్తుంది. ఈ ఆశలు మోసులెత్తే సందర్భమే ఉగాది. తెలుగు వారి సంవత్సరాది. ఈ ఉగాది నామ సంవత్సరం శ్రీవిశ్వావసు. ఈ నేపథ్యంలో ఈ పర్వ దిన విశిష్టతను, ఉగాది సంబురాన్ని ఓసారి తెలుసుకుందాం రండి.

చాలా పండగలు ప్రకృతిలోంచే ప్రభవిస్తాయి. మనిషికి, ప్రకృతికి ప్రాథమికంగా ఉన్న అనుబంధాన్ని అవి చాటి చెబుతాయి. ప్రకృతి తొలి నుంచీ మనిషికి ఆకలి తీర్చే ఆదరువు. బతుకు పాఠాలను విడమర్చి చెప్పే గురువు. ప్రకృతిలోని ప్రతి చెట్టూ, పుట్టా, వాగూ వంకా మాట్లాడతాయి; వినే మనసు ఉంటే. ప్రతి పిట్టా, పువ్వూ, మిగతా 2లో...

















తెలుగువారి జీవనాడి.. ఉగాది



(మొదటి పేజీ తరువాయి..)

మబ్బూ, మానూ సంభాషిస్తాయి, అర్థం చేసుకొనే మనిషి ఉంటే.

ప్రకృతిలో మన బంధం తరతరాలది. భూమ్మీద తొలి జీవి నడయాడిన కాలం అంత పాతది. మనిషి నేర్చుకున్న జ్ఞానమంతా ప్రకృతిలోనిదే! ప్రకృతిలో ఇమిడి ఉన్న కార్యాకారణ సూత్రాలే మనకు బతుకు పాఠాలు. ప్రకృతిపరమైన, వ్యవసాయ సంబంధమైన ప్రతి పండగలోనూ మనిషికి ప్రకృతితో ముడిపడి ఉన్న అనుబంధం కనిపిస్తుంది. అలా చూసినప్పుడు ఉగాది అక్షరాలా ప్రకృతి పండగ. ఉగాది వేళ పల్లవించే ప్రతి మార్పులోనూ మన జీవితానికి అన్వయించే పాఠం ఒకటి అంతర్లీనంగా ఇమిడి ఉంటుంది. పరికించే చూస్తే – ఉగాది జీవితాన్ని నిర్వచించే పండుగ. జీవితాన్ని నిర్మించే పండుగ.

ఉగాది పచ్చడి విశిష్టత ఇదీ..

ఉగాదికి ప్రత్యేకంగా తయారు చేసే పచ్చడి జీవిత పరమార్థాన్ని విడమర్చి చెబుతుందని అంటారు. సుఖదు:ఖాలు, కోపతాపాలు, ప్రేమాభిమానాలు, అభినందనలూ అవమానాలూ వంటివి ఎవరి జీవితంలోనైనా సహజమే! ఆరు రుచుల సమ్మేళనంగా అలరించే ఉగాది పచ్చడి – అలాంటి అనుభవాలకు ప్రతీకగా అభివర్ణిస్తారు. ఉగాది వేళకు ప్రకృతిలోనే పచ్చడికి అవసరమైన దినుసులు సిద్ధంగా ఉంటాయి. పంట చేలో చెరుకు గడ పక్వానికి వచ్చి ఉంటుంది. తోటలోనో, ఇంటి పెరట్లోనో చిన్ని చిన్ని నక్షత్రాల్లాంటి గుత్తులను దిగేసుకొని వేపచెట్టు కనిపిస్తుంది. లేలేత ఆకుల మధ్య టెంక కట్టని దశలో మామిడి గుత్తులు వేలాడుతూ ఉంటాయి. విరగ్గాసిన చింత చెట్ల నుంచి అప్పటికే కొత్త చింతపండు వెదురు గంపల్లోకి చేరి ఉంటుంది. ముప్పేట తిరిగిన కొబ్బరి, పక్కాగా పండిన అరటి, కొరికితే పిండైపోయే వేపిన శనగపప్పు... అన్నీ కొత్తకొత్తగా ఉంటాయి. ఈ దినుసులన్నిటికీ ఉప్పు కూడా జోడించి – సరైన పద్ధతిలో సమపాళ్లలో కలిపితే– ఉగాది పచ్చడి ఊరిస్తూ సిద్ధమవుతుంది. ఉగాది కవిత్వంలాగానే ఉగాది పచ్చడి మీదా బోలెడు జోకులూ, కార్టూన్లూ ఉన్నాయి. అదంతా సృజనకారుల అతిశయమే తప్ప– ఉగాది పచ్చడి వల్ల ఉత్పన్నమయ్యే పేచీ ఏమీ లేదు.

హాయిగా ఆస్వాదించగలిగితే ఉగాది పచ్చడిలో ఉన్న ఆనందమే ఆనందం. ఇంకే వంటకంలోనూ, ఆహార పదార్థంలోనూ తారసపడని రుచి ఆ పచ్చడిది. తీయతీయగా, పుల్లపుల్లగా, చేదుచేదుగా.... కలగలపి చవి చూపే సందర్భం ఇది. చెంచాడు పచ్చడి నోట్లో వేసుకోగానే – తొలి తొలిగా నాలిక్కి తీపి స్ఫురిస్తుంది. ఆ వెంటనే పులుపు పలకరిస్తుంది. వగరు కూడా ఉన్నానని గుర్తు చేస్తుంది. పంటికింద చిక్కిన వేపమొగ్గను అదాటున కొరికితే– చేదు పలకరించి పరాక్రమిస్తుంది. 'అయ్యో, చేదు' అనుకొని– ఊసేయబోతే మిగతా రుచులూ నేలపాలవుతాయి. చేదు అనుకొని వదిలేయబోతే– తీపి కూడా దూరమవుతుంది మరి! అన్ని రుచులూ కలగలిసిన పచ్చడిని ఆస్వాదించటమే అప్పుడు చేయాల్సిన పని. తీపికోసం చేదును స్వీకరించాలి. పులుపులోని పులకింత కోసం వగరులోని పొగరునూ ఆహ్వానించాలి. గెలుపు కోసం ఓటమిని ఎదుర్కోవల్సి ఉంటుంది. రేపటి సుఖం కోసం నేడొక కష్టాన్ని భరించాల్సి ఉంటుంది. ఆరు రుచులు కలగలిసిన ఉగాది పచ్చడి మనకు బోధించే జీవిత పరమార్థం ఇదే!

శిశిరం తరువాత వసంత శోభ

ఉగాది వేళ పచ్చడిలోనే కాదు; ప్రకృతిలోనూ అలాంటి పాఠమే ఉంటుంది. ఉగాదికి ముందు వరకూ శిశిరం తాండవిస్తుంది. చలిగాలులు చుట్టుముడతాయి. చెట్టూ చేమల్లో చైతన్యం మందగిస్తుంది. జీవుల్లో కలివిడితనం తగ్గిపోతుంది. నేలనిండా నెమ్మదితనం ఆవరిస్తుంది. శీతల రాత్రులు సుదీర్ఘంగా నడుస్తాయి. వణికించే చలి మునగదీసుకొని పడుకునేలా చేస్తుంది. కొన్ని జీవుల సుప్తావాస్థలోకి జారుకుంటాయి కూడా. జీవన క్రియలు మందగిస్తాయి. చెట్ల ఆకులు హరిత కాంతులను నెమ్మది నెమ్మదిగా కోల్పోతాయి. పచ్చదనాన్ని కోల్పోయి పసుపుపచ్చగా మారతాయి. ఆకులన్నీ రాలిపోతాయి. ప్రకృతి మొత్తం నిండుదనం కోల్పోయి మోడువారినట్టు కళావిహీనం అవుతుంది. ఇలా కొన్ని రోజులో, వారాలో గడుస్తాయి. శిశిరం సెలవు తీసుకొని, కాలంలో కలిసిపోతుంది. వసంతం ఆగమిస్తుంది. ఆకులు రాలిన కొమ్మల్లో లేలేత చివుళు తలెత్తుతాయి. ఎర్రెర్రగా, లేలేతగా తళతళలాడతాయి. చిరుగాలుల తాకిడికి మిలమిల మెరుస్తూ ఆకులు కనువిందు చేస్తాయి. చూస్తుండగానే మోడువారిన చెట్లు కొత్త ఆకుల గుబర్లతో కొంగొత్తగా నవనవలాడతాయి. శీతల రాత్రులు, మంచు కురిసే ఉదయాలూ – మాయం అయిపోతాయి. నులివెచ్చని సూరీడు ప్రకృతికి గోరువెచ్చని హాయిని ప్రసాదిస్తాడు. కొత్త గాలులు పల్లవిస్తాయి. ఆకులు రాలిన వేప విచిత్రంగా తెల్లని పూగుత్తులు విరగకాస్తుంది. జేగురురంగు ఆకుతో కనువిందు చేసే మామాడిచెట్లు – పిందెలను పొదుపుకొని ఇంతింత కాయలను అలంకరించుకుంటుంది. శిశిరాన్ని చూసి నిరుత్సాహపడితే.. – వసంతాల వేళ ఇన్ని హాయిల ఆనందహేలను ఆస్వాదించగలమా ? వ్యక్తి జీవితంలోనైనా, సామాజిక పరిణామాల్లోనైనా – ఇలాంటి ఎగుడు దిగుళ్ల సహజం. మనం ఆనందించే మార్పూ ఉంటుంది. ఆశ్చర్యపోయే విషాదమూ ఉంటుంది. ఆకులు రాల్చిన శిశిరం శాశ్వతంగా ఉండిపోదు. ఆకులన్నీ రాలిన చోటే కొత్త చిగురు కనిపిస్తుంది అన్న కవి వాక్యంలోని ఆశాభావం ఇదే!

మనకు కష్టం కలిగించే మార్పులు, ఇష్టం లేని పరిస్థితులు కొన్నిసార్లు ఎదురవుతాయి. వాటిని తిట్టుకుంటూ లేదా నిరాశపడుతూ కూర్చుంటే ఉపయోగం లేదు. మంచి మార్పు కచ్చితంగా వస్తుందని గాఢంగా నమ్మి మన ప్రయత్నం మనం చేస్తూ ముమ్ముందు సాగటమే ప్రకృతి సూత్రం.

ప్రకృతినిండా వసంతగానం!

ఉగాది ఏతెంచిన తరుణాన ప్రకృతి అంతా పచ్చగా పరవశిస్తుంది. అందుకు తగ్గట్టుగానే జీవుల్లోనూ వసంతోత్సాహం వెల్లివిరుస్తుంది. గుబురు కొమ్మల్లో దాగి దాగి గండు కోయిల కుహూకుహూ గానం చేస్తుంది. లేత చిగుళ్లను తింటూ వసంత కాలానికి ఒక శబ్ద సౌందర్యాన్ని జత చేస్తుంది. తరతరాలను ఒకే రకమైన అనుభూతితో ముడిపెట్టే ప్రకృతి సహజ సంబంధం ఈ కోయిళ్ల కోలాహలం. మన సమాజం పూర్తిగా వ్యవసాయ ప్రధానంగా సాగినప్పుడు – ఉగాది కాలం మొత్తం గొప్ప తీరుబాటు సమయం. సంక్రాంతికి పంటలన్నీ ఇంటికి చేరేవి. కొద్దోగొప్పో అపరాల పంటలు పొలాల మీద ఉండేవి. ఉగాదికి ప్రధానమైన వ్యవసాయ పనులు అయిపోయి, పొలాలు ఖాళీగా ఉండేవి. అది రైతులకు మమ్మరమైన పనుల నుంచి పుష్కలమైన విరామం దొరికే కాలం. ఆ విరామ తరుణంలో కుటుం బాల్లోని యుక్త వయస్కులకు పెళ్లిళ్లు.. ఆ సందర్భాన పిన్నలకు, పెద్దలకు సందళ్లు. ఇంటిముందూ, వీధుల్లో పెద్దపెద్ద తాటాకు పందిళ్లు. ముమ్ముందు ముదిరే ఎండలకు ఆ పందిళ్లే చలువ కేంద్రాలు. ఆటపాటలకు, కబుర్లూ కాలక్షేపాలకు ఆరామాలు. వ్యవసాయం గాడి తప్పాక, అనేక ఆధునిక వ్యాపకాలూ, వృత్తులూ అనుభవంలోకి వచ్చాక– ఈ క్రమం కొంత మారింది. అయినా, పల్లెల్లో ఇప్పటికీ ఈ వాతావరణం ఎంతోకొంత మిగిలిఉంది.

పంచాంగ శ్రవణం.. పార్టీల గమనం

ఉగాది రోజున పచ్చడికి ఎంత ప్రాధాన్యం ఉందో పంచాంగ శ్రవణానికీ అంత ప్రాముఖ్యం ఉంది. ఆ రోజున ఏడాది మొత్తం ఎలా నడుస్తుందో పంచాంగ కర్తలు చెప్పటం ఆనవాయితీగా వస్తోంది. వానలు ఎలా కురుస్తాయి? ఏఏ పంటలు పండుతాయి? వంటి సంగతులను వివరిస్తారు. విజ్ఞానం ఇంతగా పెరిగిన దశలో వర్షాల రాక, సేద్యంలో మెలకువల గురించి చెప్పటానికి నేడు అనేక విభాగాలు ఉన్నాయి. అయినప్పటికీ ఒక తంతులా పంచాంగ శ్రవణం నడుస్తూనే ఉంది. రైతుల వెతలూ కతలూ ముడిపడి ఉన్నది పంచాంగంతో కాదని మనకు అర్థమవుతూనే ఉంది. అధికారంలో ఉన్న పార్టీలు అవలంబించే విధానాలే సాగుదారుల భవిష్యత్తును నిర్ణయిస్తాయి. సాగుకు సాయం, పంటకు ధర కావాలంటే– అడగాల్సింది ప్రభుత్వాలనే.

పంచాంగ శ్రవణాలు ఇప్పుడు ప్రహసనంగా మారిపోయాయి. రాజకీయ పంచాంగాలకైతే– కొద్దిపాటి పోలిక కూడా ఉండదు. ఒక్కో పార్టీ కార్యాలయంలో ఒక్కో రకం పంచాంగాలు నడుస్తున్నాయి. ఏ రోటి కాడ ఆపాట పాడటం అన్న చందాన నడుస్తున్నాయి. ఒకప్పుడు కొందరికే పరిమితమైన ఈ పంచాంగాలు నేడు టీవి ఛానెళ్ల ప్రభావంతో ఇంటింటా వినిపిస్తున్నాయి. ప్రకృతి కొన్ని సూత్రాల ఆధారంగా మనకు ఆచరణను నేర్పింది. అలాంటి జాగురతను, జాగ్రత్తనూ ప్రదర్శించటం మంచిపని. మన పూర్వతరాల వారు తమ అనుకూలత, అవసరాల్లోంచి ఉగాది వంటి పండుగలను జరుపుకొంటే– మారిన పరిస్థితుల్లో మనం వాటినే మక్కికి మక్కి అనుసరించటం అశాస్త్రీయం. ప్రకృతి పట్ల అవగాహన, ప్రకృతితో సమన్వయం, పర్యావరణ స్పృహ, ప్రకృతి ప్రత్యక్షంగా, పరోక్షంగా నేర్పే పాఠాలను అన్వయించుకోవటం– విజ్ఞత. ఆ పరిధిని, పరిమితిని గుర్తెరిగి, ఉగాదిని మనం ఆస్వాదించాలి.

రైతు సంతోషమే నిజమైన ఉగాది

పరమార్థాలను పక్కన పెట్టి, పర్వదినాలను జరుపుకుంటే – వట్టి తంతు మాత్రమే అవుతుంది. ఇప్పటి రైతు పరిస్థితి కొన్ని వేల సంవత్సరాల క్రితం నాటిది కాదు. అంతా సవ్యంగా సాగిపోయే స్థితి లేదు. సాగునీరు, పెట్టుబడి, ఎరువులు, మందులు, వాటి ధరలూ, దిగుబడి, గిట్టుబాటు ధర, మార్కెటింగ్ వంటివన్నీ ఆధునిక కాలపు అవసరాలు. వీటిని పంచాంగం తీర్చదు, ప్రభుత్వమే పట్టించుకోవాలి.

పట్టించుకునేలా ప్రభుత్వాలూ వ్యవహరించటకపోవటం మరొక ధోరణి. రైతులను నిర్వాసితులను చేసి, పంటభూములను బడా కంపెనీలకు కట్టబెట్టటం మరొక విపరీతం. వీటిని అర్థం చేసుకొని, అడగగలిగిన, అడ్డుకోగలిగిన చైతన్యం రైతుల్లో రావాలి! రైతు శ్రమించి, వడ్డిస్తున్న వరిధాన్యాలనే మనం భుజిస్తున్నాం కాబట్టి– మనందరం అండగా నిలవాలి. అప్పుడే రైతుకు నిజమైన ఉగాది. దేశానికి బలమైన పునాది.

సంస్కృతిలో భాగమే పండుగలు

- ఎస్.వెంకట్రావు
ఎడిటర్, మార్క్సిస్టు సైద్ధాంతిక మాసపత్రిక

మనం నిత్యం నిర్వహించుకునే పండగలు, ఉత్సవాలు, జాతరలు, కొలుపులు మొదలైనవన్నీ మన సంస్కృతిలో భాగం. పండుగలు, ఉత్సవాలు అన్నీ మతపరమైనవి కావు. కొన్ని పండుగలు పూర్తిగా మానవుని ఉత్పత్తికి సంబంధించినవి. అంటే వ్యవసాయం, పశుపోషణ వంటివాటికి సంబంధించి ఉంటాయి. కొన్ని ప్రకృతిపై మానవుడు విజయం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని జరుగుతుంటాయి. కొన్ని పండుగలు పూర్తిగా మత నమ్మకాలు, కథలపై ఆధారపడి ఉంటాయి. అయితే వీటన్నిటినీ ఇలా పూర్తిగా విడదీసి చూడ్డం కూడా కష్టం. మానవుని ఉత్పత్తికి, ప్రకృతిపై విజయాలకూ సంబంధించిన పండుగల్లో కూడా మళ్లీ మతపరమైన నమ్మకాలు, ఆచారాలు ఉంటాయి. అదే సమయంలో పూర్తిగా మతపరమైన కథలపై ఆధారపడిన పండుగల్లో కూడా వెదికి చూస్తే మానవ సమూహాల అభివృద్ధికి సంబంధించిన అనేక చారిత్రక విషయాలు కనిపిస్తుంటాయి. మానవుడు మనుగడ కోసం ప్రకృతితో సాగించిన పోరాటంలో ఒక్కో విజయం సాధించడం ద్వారానే అభివృద్ధి పథంలో ముందుకుపోతూ వచ్చాడు. అయితే ప్రకృతితో మనిషి ఒంటరిగా పోరాడలేదు. సామూహికంగా, సమిష్టిగా పోరాడాడు. అందువల్ల ప్రకృతిపై విజయం సాధించినప్పుడు మానవులు సమిష్టిగానే సంతోషం పంచుకున్నారు. అవే సంబరాలు, ఉత్సవాలు అయినాయి. ఆదిమానవునికి అగ్గి అప్పట్లో కొరకరాని కొయ్య. అగ్గితో చాలా పనులు చేయవచ్చు. ఎముకలు కొరికే చలినుండి అది కాపాడుతుంది. అడవుల్లో క్రూరమృగాలను భయపెట్టి దూరంగా ఉంచుతుంది. మాంసం, దుంపలు, కూరగాయలు, గింజలు కాల్చుకు తినడానికి ఎంతగానో ఉపకరిస్తుంది. కాని మానవునికి దాన్ని స్వాధీనం చేసుకోవడం... అంటే ఎప్పుడు కావాలంటే అప్పుడు అగ్గిని సృష్టించుకోవడం అంత తొందరగా అలవడలేదు. దావానలాల్లో దొరికిన నిప్పును కాపాడుకుంటూ చాలాకాలం గడిపాడు. కాని దాన్ని కాపాడుకోవడం, వర్షం, వరదల నుండి పొడిగా ఉంచుకోవడం చాలా శ్రమతోనూ, ప్రయాసతోనూ కూడిన పని. తరువాత చెక్కలను రాపాడించడం ద్వారా, చెకుముకిరాళ్లను కొట్టడం ద్వారా నిప్పు చేయడం నేర్చుకున్నాడు. దాంతో మనిషి నిప్పుపై అధిపత్యం సాధించాడు. ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎక్కడ కావాలంటే అక్కడ నిప్పు తయారు చేయడం నేర్చుకోవడమే కాదు, నిప్పును అనేక రకాలుగా ఉపయోగించడం ప్రారంభించాడు. చివరికి నిప్పు మనిషి జీవితంలోనూ, అభివృద్ధిలోనూ అత్యంత కీలకాంశంగా మారింది. ఇటువంటి నిప్పుపై సాధించిన విజయం మానవాళికి చిన్న విషయమేమీ కాదుకదా! అందుకే నిప్పుపై విజయం ప్రపంచంలోని అన్ని మానవ సమూహాలకూ పండగే అయింది. మనకు దీపావళి మాదిరిగానే ప్రపంచంలోని అన్ని మానవ సమాజాల్లోనూ దీపాల పండుగలు ఉంటాయి. వాటిచుట్టూ అనేక రకాల కథలు ఉండవచ్చుగాక. ఒక్కో సమాజం అగ్గి గురించిన ఒక్కో రకం కథను సృష్టించుకోవచ్చుగాక. కాని అన్నిట్లోనూ ఉన్న ఉమ్మడి అంశం అగ్గిపై మానవుని విజయమే, చీకటి నుండి వెలుగులోకి మనిషి ప్రయాణమే. ఇదే విధంగా వ్యవసాయ సమాజాల్లో పంటలు వేసే తరుణం, పంట చేతికొచ్చే తరుణం సంబరాలుగా మారాయి. పశుపోషణ ప్రధానంగా ఉన్న సమాజాల్లో పశువులపై విజయమే అంటే పశువులను మచ్చిక చేసుకోవడమే పండుగలుగాను, ఉత్సవాలుగానూ మారాయి.

అయితే మన పండుగలన్నీ ప్రకృతిపై విజయాలకు సంబంధించినవే కావు. ప్రకృతి శక్తులను స్వాధీనం చేసుకునే క్రమంలో మనిషి ప్రకృతికి సంబంధించిన ఒక్కో దృగ్విషయాన్నే కనుగొంటూ వచ్చాడు. అయినా అతనికి ఎల్లప్పుడూ తెలియని విషయం ఉంటూనే వస్తోంది. తెలియని విషయాల చుట్టూ, తన స్వాధీనంలో లేని శక్తుల చుట్టూ మనిషి అనేకానేక నమ్మకాలు ఏర్పర్చుకున్నాడు. అనేక కథలు అల్లుకున్నాడు. తాను గెలవలేని శక్తులను ప్రసన్నం చేసుకోవడం ద్వారా, వాటిని అనుకరించడం ద్వారా తనకు అవి లోబడి ఉండేటట్లు, లేక తన ఇచ్ఛకు అనుకూలంగా మెలిగేట్లు చేయవచ్చుననుకున్నాడు. అందులో నుండి పుట్టినవే ప్రకృతి ఆరాధన, క్రతువులు, మతనమ్మకాలు వగైరా. ఆదిమానవుడు చెట్టునూ పుట్టనూ ప్రసన్నం చేసుకోడానికి క్రతువులాచరించాడు. వ్యవసాయ సమాజంలో రుతుచక్రాన్ని తనకు అనుకూలంగా మలుచుకునేందుకు పూజలు చేశాడు. ధాన్యం జీవనాధారం గనుక ధాన్యలక్ష్మిని ఆరాధించాడు. ఆధునిక సమాజంలో ధనం, డబ్బు పోగుపడ్డాక అది ఏవిధంగా తనవద్దకు వస్తుందో, వచ్చింది ఎందుకు తననుండి పోతుందో అర్ధంకాక అయోమయం నుండి బయటపడడానికి భగవంతుని ప్రార్ధిస్తున్నాడు. ఈ సమాజంలో డబ్బే సర్వస్వం గనుక ధనలక్ష్మిని తన ఆధీనం చేసుకోడానికి వ్రతాలు, యాగాలు చేస్తున్నాడు. దీక్షలు పడుతున్నాడు.

ఆహారోత్పత్తి క్రమంలో ప్రకృతితో మానవుడు సమిష్టిగా పోరాడాడని చెప్పుకున్నాం కదా! ఈ సమిష్టి పోరాటంలో మానవుల మధ్య కూడా అనేకరకాల సంబంధాలేర్పడ్డాయి. మనిషిని మనిషి పీడించడం, ఒక జాతిని మరొకజాతి పీడించడం జరిగింది. ఈ పీడననుండి విముక్తి కోసం పోరాటాలు జరిగాయి. ఈ పోరాటాల్లో జయాపజయాలు కూడా పండుగలు, పర్వదినాలు, దుర్దినాలుగా మారి మన సంస్కృతిలో భాగం అయినాయి. ప్రాచీన గణవ్యవస్థలో గణనాధులే తరువాత దేవుళ్లు, దేవతలు అయ్యారు. వారి కొలుపులు పండుగలు ఉత్సవాలుగా మారాయి. పరాయిపీడన నుండి విముక్తి కోసం జరిగిన పోరాటంలో నేలకొరిగిన వీరుల జన్మదినాలు పర్వదినాలుగా మారాయి. పరాయి పాలన నుండి విముక్తి జరిగిన దినాలు ముఖ్యమైన జాతీయ పర్వదినాలుగా మారాయి.

ఈ విధంగా ఆదిమానవుడు నిప్పు, నీరుపై విజయం సాధించినప్పటి నుండి నిన్నమొన్న పరాయిపాలన నుండి విముక్తి వరకు మానవజాతి ప్రయాణంలోని ప్రతి విజయం, అపజయం పండుగగానో, పర్వదినంగానో, మరో ముఖ్యమైన దీక్షా దినంగానో మారుతూ వచ్చాయి. వాటిచుట్టూ అనేక కథలు, నమ్మకాలు ఏర్పడుతూ వచ్చాయి. అందువల్ల పండుగలు, ఉత్సవాలు మన సుదీర్ఘ సంస్కృతిలో ఒక భాగం.

మన సాంస్కృతిక వారసత్వమంతా అంటే మానవుడు అప్పటివరకు నేర్చుకున్న విజ్ఞానం, కళలు, సాహిత్యం, నృత్యం, సంగీతం వగైరాలన్నీ పండుగల్లో ప్రదర్శితమవుతాయి. మానవుడు వ్యక్తిగతంగా గాని, సమిష్టిగాగాని సంపాదించిన భౌతిక సంపద, భౌద్ధిక సంపద ప్రదర్శించడానికి పండుగలు వేదికలవుతాయి. ఒక మానవ సమూహపు సాంస్కృతిక వారసత్వాన్ని తెలుసుకోవాలంటే వారి పండుగలు, ఉత్సవాలు, జాతరలను పరిశీలిస్తే చాలా విషయాలు తెలుస్తాయి. ఉదాహరణకు.., సంక్రాంతి పండుగనే చూడండి. అది పంటచేతికొచ్చిన తరుణంలో జరిగే పండుగ కనుక వ్యవసాయ సమాజాలపై అధారపడి బతికే కళాకారులంతా – హరిదాసులు, గంగిరెద్దులవాళ్లు, బుడబుక్కలవాళ్లు, జంగమ దేవర్లు వగైరా ఆ పండుగ రోజుల్లో తమ కళలను ప్రదర్శిస్తారు. పండుగ సందర్భంలో ప్రజలు ఇళ్లు అలకడం, రంగులు, ముగ్గులు వేయడం ద్వారా తమ కళాకౌశలాన్ని ప్రదర్శిస్తారు. పండుగ పాటలు, పద్యాలు, నాటకాలు, కోడిపందేలు, గొర్రెపొట్టేళ్ల పందాలు, ఎడ్ల పందేలు వగైరాలన్నీ ప్రజల సాంస్కృతిక ప్రదర్శనలే. సంక్రాంతి మాదిరిగానే దసరా పండుగ సందర్భంలో కూడా వివిధ ప్రాంతాల్లో వివిధ రకాలైన సాంస్కృతిక రూపాలు ప్రదర్శిస్తారు. అలాగే వృత్తులను బట్టి, కులాలను బట్టి కూడా రకరకాలైన సంబరాలు జరుపుకుంటారు. వారివారి సాంప్రదాయ కళారూపాలను ప్రదర్శిస్తారు.

మనం చేసుకునే పండుగలు, ఉత్సవాలు, సంబరాల్లో మూఢ నమ్మకాలుంటాయి. చారిత్రక వాస్తవాలూ ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ఏవి మూఢనమ్మకాలో, ఏవి చారిత్రక వాస్తవాలో చెప్పడం కష్టంగా ఉండవచ్చు కూడా. కాని చాలా పండుగలను విశ్లేషిస్తే అందులో దేవుళ్లూ, మహిమలకు సంబంధించిన నమ్మకాలనూ, వాటిచుట్టూ ఉన్న పురాణ గాథలనూ, ఆ గాథల వెనుకనున్న చారిత్రక వాస్తవాలను వేరుచేసి చూడగలుగుతాం. ఉదాహరణకు, దసరా పండుగనే చూడండి... పదిరోజులు సాగే ఈ పర్వదినాల్లో చివరిరోజైన విజయదశమినాడు ఉత్తరాదిలో రామలీల ఉత్సవాలు జరుపుతారు. ఆ రోజు రావణాసురునిపై రాముడు విజయం సాధించాడని వారి నమ్మకం. ఢిల్లీలోని రామలీలా మైదానంలో పెద్దపెద్ద రావణాసురిడి బొమ్మలు చేసి వాటికి టపాసులు అమరుస్తారు. రాముడు విడిచిపెట్టిన బాణం వెళ్లి రావణాసురుణ్ణి తాకగానే అగ్గిరాజుకుంటుంది. పది తలల రావణాసురుడు కాలి బూడిదైపోతాడు. చెడుపై మంచి విజయం సాధించిన సందర్భంగా ఈ ఉత్సవం చేస్తారని చెబుతారు. అదే దక్షిణాదిలో అయితే దసరా సందర్భంగా రాముణ్ణి కొలవడం ఎక్కడా ఉండదు. ఆ రోజున అమ్మవారి పండుగలు జరపడమే దక్షిణాది ఆచారం. చాలా గ్రామాల్లో అమ్మవారి కొలుపులే దసరా ఉత్సవాలు. అమ్మలందరికీ ఆదిమాత అయిన దుర్గాదేవిని కొలవడం దక్షిణాదిలోనూ, బెంగాల్‌లోనూ ఆచారం. దుర్గామాత సింహారూఢురాలై మహిషాసురుడనే రాక్షసుణ్ణి వధించింది కాబట్టి ఈ రోజును పండుగగా జరుపుకుంటారు. ఇక్కడ కూడా కథ వేరుగాని చెడుపై మంచి విజయం అనేదే భావన. కాని ఇక్కడే సాంస్కృతిక తేడాకూడా కనిపిస్తుంది. ఉత్తరాది వారిది ప్రధానంగా ఆర్య సాంస్కృతిక వారసత్వం. ఆర్యులు పశుపోషకులు. వారిది ఆదినుండి పితృస్వామిక సమాజం. పితృస్వామిక సమాజంలో మగవారిదే ఆధిపత్యం. అందువల్ల వారి దేవుళ్లు, దేవతలు మగవారే. అందుకే వారి దసరా పండగ కథలో కథానాయకుడు పురుషుడు. కాని దక్షిణాది సమాజాలు వ్యవసాయ ప్రధాన సమాజాలు. ఈ సమాజాల్లో ఆదిలో మాతృస్వామిక వ్యవస్థలుండేవి. మాతృస్వామిక వ్యవస్థల్లో మహిళలదే కుటుంబాధిపత్యం. అందుకే ఇక్కడ దేవుళ్లూ, దేవతలు ప్రధానంగా మహిళలే. అమ్మవార్లు, దుర్గామాత ఆ సాంప్రదాయం నుండి వచ్చినవారే. ఇక్కడ చెడుపై విజయం సాధించింది కుటుంబానికి పెద్ద అయిన మహిళ. ఇంకో కథనం ప్రకారం... దుర్గాదేవి, లేక అమ్మవార్లు ఆయా మాతృస్వామిక సమాజాల నాయకురాళ్లు కాగా మహిషాసురుడు దున్నపోతు. అంటే ఆనాటి కుటుంబ యజమాని అయిన మహిళ దున్నపోతును స్వాధీనం

మిగతా.. 4లో..

ఉగాది సందర్భంగా వ్యవసాయ పనులను ప్రారంభిస్తున్న రైతులు



సంస్కృతిలో భాగమే పండుగలు

(3వ పేజీ తరువాయి)

చేసుకుని వ్యవసాయానికి ఉపయోగించడంలో కీలకపాత్ర వహించిందన్న మాట. పశువులను లొంగదీసుకుని వ్యవసాయానికి ఉపయోగించుకోవడంలో, అంటే పశువులతో వ్యవసాయం చేయడం కనుగొనడంలో నాటి మానవుడు సాధించిన విజయానికి దక్షిణాది విజయదశమి ప్రతీక. దక్షిణాదిలో దున్నపోతు ప్రధానంగా వ్యవసాయంలో ఉపయోగపడుతుంది. గేదె పాలు వారు ప్రధానంగా వాడుతారు. కాని ఆర్యులకు ఆవులు, ఎడ్లు ప్రధానం. ఇక్కడ కూడా ఉత్తరాది ఆర్య సంస్కృతికీ, దక్షిణాది సంస్కృతికి ముఖ్యంగా శూద్రకులాల సంస్కృతికీ మధ్య తేడా కనిపిస్తుంది. కాలక్రమంలో ఈ సంస్కృతులు చాలా వరకు కలిసిపోయినా నేటికీ పండుగలు, ఆచారాలు, వాటిచుట్టూ ఉండే కథలనుండి ఈ తేడాను మనం విశ్లేషించ గలం. దసరా రోజుల్లోనే మన రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో 'బతకమ్మ' పండుగ జరుపు కుంటారు. ఈ పండుగ గురించి కూడా అనేక కథలు ఉన్నప్పటికీ ఇదీ ప్రధానంగా వ్యవసాయానికి సంబంధించిన పండుగే.

విజయదశమి విజయానికి చిహ్నం గనుక రాజులు, చక్రవర్తులు విజయదశమి రోజునే యుద్ధాలు, దండయాత్రలు ప్రారంభించడానికి మంచి ముహూర్తంగా ఎన్నుకునేవారు. అర్జునుడు విజయదశమి రోజునే జమ్మిచెట్టుమీద నుండి ఆయుధాలు తీసి కౌరవులపై యుద్ధం చేసి విజయం సాధించాడని మహాభారత కథ చెబుతోంది. బహుశా విజయదశమి రోజున జమ్మిచెట్టు పూజలు చేయడం, ఆయుధపూజ చేయడం అందునుండే వచ్చిందేమో. వాస్తవంగా విజయదశమి సంభవించే కాలం యుద్ధాలకు అనువైన కాలంకూడా. ఆశ్వయుజ మాసంలో పాడ్యమి నుండి దశమి వరకు దసరా ఉత్సవాలు జరుగుతాయి. చివరిరోజైన దశమినే విజయదశమి అంటున్నారు. ఆశ్వయుజ మాసంలో శరదృతువు ప్రారంభమవుతుంది. వర్షాలు వెలిసి ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రిళ్లు శరచ్చంద్రుడు స్పష్టంగా దర్శనమిస్తాడు. వెన్నెల పిండి ఆరబోసినట్లుంటుంది. ఉష్ణోగ్రత అనుకూలంగా ఉంటుంది. యుద్ధాలకు పోయే ప్రభువులు, ఆయుధాలకు పూజచేసి పనిలో పెట్టడానికి దీన్ని మంచి కాలంగా ఎన్నుకున్నట్లు కనిపిస్తుంది. నిజానికి విజయదశమిని, నాటి రాజులు ఆర్థిక సంవత్సరానికి ప్రారంభదినంగా పాటించేవారు.

విజయదశమిలాగే దీపావళి చుట్టూ కూడా అనేకానేక కథలు ఉన్నాయి. శ్రీకృష్ణుడు సత్యభామ సహకారంతో నరకాసురుణ్ణి వధించాడు గనుక ప్రజలు ఆనందంతో మరునాడు దీపావళి సంబరం చేసుకుంటారని ఒక కథ. ఇంకో కథకూడా ఉంది. లంకలో రావణుని సంహరించి, రాముడు సీతాసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చినప్పుడు ప్రజలు ఆనందంతో ఈ పండుగ జరుపుకున్నారని చెబుతారు. ఉత్తరాదివారు ముఖ్యంగా వ్యాపారులు దీపావళి రోజును కొత్త ఆర్థిక సంవత్సరంగా పాటిస్తారు. ఆ రోజు లక్ష్మీదేవి పూజచేసి కొత్త ఖాతా పుస్తకాలు తెరుస్తారు. ఈ కథలన్నీ ఎలా ఉన్నా మానవుడు అగ్గిపై సాధించిన విజయమే దీపావళిగా మారిందని చెప్పవచ్చు. దీపావళి పండుగల్లా ంటివే ప్రపంచంలోని అన్ని సమాజాల్లోనూ ఉండడమే దీనికి మంచి నిదర్శనం. దాదాపు అన్ని పండుగలు, ఉత్సవాల చుట్టూ ఇటువంటివే అనేక కథలు, నమ్మకాలు అల్లుకుని ఉంటాయి. విశ్లేషించి చూస్తే వాటివెనుకగల చారిత్రక వాస్తవాలు బోధపడతాయి. అయితే ఈ చారిత్రక వాస్తవాలు కొన్ని పండుగల్లో స్పష్టంగా కనిపించవచ్చు, కొన్నిటిలో పూర్తిగా కట్టుకథల మరుగున పడిపోయి అస్పష్టంగా మారిపోయి ఉండవచ్చు.

ఉగాది

వసంత రుతువును ఆహ్వానిస్తూ పండుగ జరుపుకోవడం ప్రపంచ వ్యాపితంగా చూస్తాం. తెలుగు వారితోబాటు, కన్నడ ప్రజలు చైత్ర శుద్ధ పాడ్యమి రోజున ఈ పండుగ జరుపుకుంటారు. మహారాష్ట్రలో గుడి పడ్వాగా, తమిళులు పుత్తాండు అనే పేరుతో, మళయాళీలు విషు అనే పేరుతో, పంజాబీలు వైశాఖీగా, బెంగాలీలు పొయ్‌లా బైశాఖీగా ఈ పండుగ జరుపుకుంటారు. చాంద్రమాన కాలం ప్రకారం తెలుగు వారి సంవత్సరం ఉగాది రోజున ప్రారంభమవుతుంది. గ్రెగోరియన్ (ఇంగ్లీషు) క్యాలెండర్ ప్రకారం ఇది మార్చి, ఏప్రిల్ మాసాల్లో వస్తుంది. మనకు శీతాకాలం నవంబరుతో ప్రారంభమై ఫిబ్రవరి చివరికి ముగుస్తుంది. ఫిబ్రవరి చివరి నుండి మార్చి చివరివరకు వసంత రుతువు నడుస్తుంది. ఈ కాలంలోనే దక్షిణాదిలో ఉగాది, (పుత్తాండు, గుడి పడ్వా, విషు) ఉత్తరాదిలో హోలీ, వైశాఖీ పండుగలు వస్తాయి.

వసంత రుతువును ఆహ్వానిస్తూ పండుగ చేసుకోవడం మన దేశంలోనే కాక ప్రపంచ మంతటా కనిపిస్తుంది. చలి ప్రదేశాల్లో శీతాకాలం పోవడం, వసంత రుతువు రావడం ప్రజలకు మరింత ఆనంద దాయకమైన విషయం. అందుకే వారు దీన్ని పెద్ద ఎత్తున జరుపుకుంటారు. కొన్ని దేశాల్లో చలికి వీడ్కోలు పలుకుతూ, మరికొన్ని దేశాల్లో కొత్త చివుర్లను, పుష్పాలను ఆహ్వానిస్తూ ఈ పండగ జరుపుకోవడం కనిపిస్తుంది. పోలెండ్‌లో మర్జాన్న, స్విట్జర్లాండ్‌లో సెషెలాటెన్, బల్గేరియాలో బాబా మార్టా డే, స్కాట్‌లాండ్‌లో హుప్పిటీ స్కూరీ, స్పెయిన్‌లో ఫాల్లెస్, జపాన్‌లో హనామి వగైరా పేర్లతో వసంత పండగ దాదాపు మార్చి, ఏప్రిల్ నెలల్లో జరుపుతారు.

ఉగాది తెలుగు వారి నూతన సంవత్సరారంభం కనుక గడచిన సంవత్సరంలో పంటల పరిస్థితిని సమీక్షించు కుని రానున్న సంవత్సరం ఎలా ఉండ బోతుందో అంచనా వేయడం జరుగు తుంది. ఇదే పంచాంగ శ్రవణానికి దారితీసి ఉండవచ్చు.



షరా మామూలే ?

1) కోయిల కూత మామిడి పూత
కొత్త సంవత్సరానికి సంకేతాలు
క్రోధి సంవత్సరానికి వీడ్కోలు
విశ్వావసు సంవత్సరానికి ఆహ్వానం
షరామామూలే?
2) కోయిల కూయకున్నా
మామిడి పూత పూయకున్నా
గడచిన ఏడాది చెంగు కప్పుకొని
నిష్క్రమిస్తుంది?
కొత్త సంవత్సరం కోటి ఆశలతో
ఆవిష్కరిస్తుంది?
షరా మామూలే?
3) తల స్నాన ఆచరించడం
దైవాన్ని స్మరించడం
షడ్రుచుల పచ్చడి స్వీకరించడం
పూజ్యం అవమానాలు లెక్క కట్టడం
షరామమూలే?
4)క్రోధి కరుణించిందని కొందరు
క్రోధంతో ఉందని మరికొందరు
గొనుక్కుంటూ విసుక్కుంటూ
విశ్వావసులో అంతా మంచే అంటూ
ఆశలు
షరా మామూలే?
5) నూతన వస్త్రాలు ధరించడం
దేవాలయాల సందర్శించడం
ఇరుగుపొరుగులను చిరునవ్వుతో
పలకరించటం
పంచాంగ శ్రవణం? ఇష్ట మనస్కుల
మధ్య కవితా గోస్టులు
షరా మామూలే?
6) కాలచక్రం తిరుగుతూ తిరుగుతూ
చీకటి పడుతుంది
కొత్త ఆశలతో ఊరించే ఊహల
జోలలతో నిద్ర పడుతుంది
చీకటిని చీల్చుకుంటూ తూర్పున
సూర్యుడు ఉదయిస్తాడు
జీవన సమరపు గమనంకై అలుపు
ఎరగని యాత్రను జీవుడు
ప్రారంభిస్తాడు?
షరా మామూలే?
7) మార్పు లేని మార్పురాని జీవితం
నిత్య దరిద్రం నిరుద్యోగం
ఆకలి చావులు అత్యాచారాలు
చావులు మామూలే
ప్రశ్నించే గొంతులను నులిమేస్తుంటే
నిరాశ నిస్పృహ నిస్సహాయతతో
ప్రయాణం సాగించడం
షరా మామూలే?

- విశ్వశాంతి
8919415804

క్రాంతి దీపం

శత్రులేవ్వరు... మిత్రులేవ్వరు
ఏవడు నీ వాడు
ఏవడు. నా... వాడు
ఏవడెవ్వడు.. ఏవడికెవడు.
మన మంతా.. జనమే
జన మంతా... మనమే..
మనలో మనకు ఎందుకు.. ద్వేషం
శాంతి కపోతాలకు
విద్వేష విషపు గింజలు
చల్లిందెవ్వరు
గిల్లి కజ్జాలు పెంచిందెవ్వరు...
చరిత్ర పేజీలను
గజి బిజిగా మార్చిందెవ్వరు
సమాధుల పునాదులు
తవ్వితే...
సత్యం కనిపిస్తోందా
నాగులు తిరిగే కోనలో
నాగ స్వరం ఊదిందేవ్వరు
ఊరూర కత్తుల అలజడి
నెత్తురుతో నేలంతా
చిత్తడి చిత్తడి
నరమేధ యాగంలో
తెగిపడిన శిరస్సులెవ్వరివి.
మతం ముసుగులో
మారణ హోమం...
రోజు రగులు తుంది
ఏదో ఒక చోట రావణ కాష్టం!
ధ్వంస రచనా గీతానికి
స్వర కర్తలేవ్వరు?
నువ్వా?
నేనా?
మనమా? జనమా?
కాదు.. కాదు.. కానేకాదు
జనమేప్పుడు.. జాతి వారసులే.
శాంతి కాముకులే..
క్రాంతి కారకులే...
మరి
కనిపించని చెయ్యేదో
అడిస్తూంది.. నాటకం
సూత్రధారులు.. వారే
పాత్రధారులు.. వారే
విద్వేషమే.. జెండా
విచ్చిన్నమే.. ఎజెండా
వేయి తలల.. విష నాగులు
జాతి.. జాగృతి కోసం
జన స్వరం ఊదుదాం
సమభావ, సామరస్య
రాగంతో శాంతి గీతం
ఆలపిద్దాం
క్రాంతి దీపం వెలిగిద్దాం

- ఎస్‌జిఎం.బాషా
9966912533

ఉగాది వేళ పసందైన వంటకాలు

ప్రజాశక్తి-విశాఖపట్నంఉగాది అనగానే మనకు ముందుగా గుర్తొచ్చేది ఉగాది పచ్చడి.. ఆ తర్వాత పంచాగ శ్రవణం.. కొత్త ఏడాది మొదటిరోజున సంవత్సరమంతా ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి ఉగాది పంచాంగ శ్రవణం చేయించుకోవడం ఎప్పటి నుంచో వస్తోన్న ఆచారం. ఇక సంవత్సరమంతా షడ్రుచుల్లా అన్ని రకాల భావోద్వేగాలకు సిద్ధంగా ఉండాలని చెబుతూ.. ఉగాది పచ్చడిని తీసుకోవడం కూడా పరిపాటే. పచ్చడే కాకుండా బొబ్బట్లు, పులిహోర వంటివి కూడా ఉగాది ప్రత్యేకమే.. ఆరోగ్యపరంగా కూడా ఈ ఆహారం తినడంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాచి. ఉగాది వేళ వివిధ వంటకాలు ఎలా చేయాలి? వాటిలోని పోషక విలువలేంటో తెలుసుకుందాం రండి.

బొబ్బట్లు

కావాల్సినవి

గోధుమ పిండి : కప్పు
మైదా : అర కప్పు
నెయ్యి : పావు కప్పు
ఉప్పు : అర టీస్పూన్
నీళ్ల : తగినన్ని
శెనగ పప్పు కప్పు
బెల్లం : కప్పు
యాలకుల పొడి : అర టీస్పూన్

తయారీ

ముందుగా గోధుమ పిండి, మైదా కలిపి చపాతీ పిండిలా తడిపి పక్కన పెట్టుకోవాలి. పిండి తడుపుతున్నప్పుడు అందులో కొద్దిగా నెయ్యి కూడా వేసుకోవాలి. ఆ తర్వాత నానబెట్టిన శెనగపప్పును ఉడికించి మెత్తని మిశ్రమంగా మెదుపుకోవాలి. ఇలా మెదుపుతున్నప్పుడే అందులో బెల్లం వేయడం వల్ల మొత్తం కలుస్తుంది. ఒకవేళ అలా చేయడం ఇష్టం లేకపోతే బెల్లాన్ని లేత పాకం పట్టుకొని అందులో ఈ పప్పు మిశ్రమం వేయవచ్చు. దీన్ని బాగా కలుపుకోవాలి. ఇలా కలుపుకున్న తర్వాత వీటిని గుండ్రని ముద్దలుగా చేసుకొని పెట్టుకోవాలి.

ఆ తర్వాత ఇంతకు క్రితం తడిపి పక్కన పెట్టుకున్న పిండితో చపాతీ చేసుకొని ఆ చపాతీ మధ్యలో ఈ ముద్దను పెట్టి చుట్టూ ఉన్న పిండిని తీసుకొచ్చి మళ్లీ దాన్ని ముద్దగా చేసుకోవాలి. ఇప్పుడు ఈ ముద్దను పొడి పిండి చల్లుకుంటూ మెల్లగా వత్తుకోవాలి. ఆ తర్వాత నెయ్యి వేసుకొని చపాతీలలాగే కాల్చుకోవాలి. ఇందులోని బెల్లం ఎన్నో పోషకాలను, ఐరన్‌ని అందిస్తే.. పప్పు మనకు కావాల్సిన ప్రొటీన్లను అందిస్తుంది. గోధుమ పిండిలోని కార్బొహైడ్రేట్లు మనకు శక్తిని అందిస్తాయి. నెయ్యిలోని ఫ్యాట్ కూడా కలవడంతో కార్బొహైడ్రేట్లు, ప్రొటీన్లు, కొవ్వులు కలిసిన సంపూర్ణ వంటకంగా ఇది మనకు పోషకాలను అందిస్తుంది.





పూర్ణం బూరెలు

పూర్ణం బూరెల కోసం సాధారణంగా మనం బొబ్బట్ల కోసం తయారుచేసుకున్న పూర్ణాన్నే ఉపయోగించవచ్చు. శెనగపప్పు బెల్లంతో తయారు చేసిన ఈ పూర్ణాన్ని పిండిలో ఉంచి బూరెల్లా చేసుకొని కాల్చుకోవాలి. దీని కోసం ముందు రోజున బియ్యం, మినప్పప్పు సమపాళ్లలో తీసుకొని నానబెట్టుకోవాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని జారుడుగా కాకుండా కాస్త గట్టిగా ఉండేలా మిక్సీ పట్టుకోవాలి. ఇందులో కాస్త ఉప్పు వేసి పక్కన పెడితే అది పులుస్తుంది. ఆ తర్వాత శెనగపప్పు, బెల్లంతో తయారుచేసుకున్న పూర్ణాన్ని అందులో వేసి నూనెలో లేదా నెయ్యిలో వేయించాలి. శెనగపప్పుతో పాటు మినప్పప్పులోని ప్రొటీన్లు కూడా అందుతాయి కాబట్టి ఈ వంటకం నుంచి పోషకాలను ఎక్కువగా పొందే వీలుంటుంది.

పులిహోర తయారీ

కావాల్సినవి

అన్నం : రెండు కప్పులు
మామిడి కాయ తురుము : మూడు టేబుల్ స్పూన్లు
కరివేపాకు : రెండు రెబ్బలు
పచ్చిమిర్చి : మూడు
ఎండుమిర్చి : రెండు
ఉప్పు : తగినంత
పసుపు : చిటికెడు
వేరుశెనగ పలుకులు : మూడు టేబుల్ స్పూన్లు
శెనగ పప్పు : టేబుల్ స్పూన్
మినప్పప్పు : టేబుల్ స్పూన్
ఆవాలు : టీస్పూన్
జీలకర్ర : టీస్పూన్
అల్లం ముక్క : అంగుళం
నూనె : మూడు టేబుల్ స్పూన్లు

తయారీ

ముందుగా పాన్లో నూనె తీసుకొని అందులో వేరుశనగ గింజలు, పప్పులు వేసి బాగా వేయించాలి. ఇవి వేయించిన తర్వాత ఆవాలు, జీలకర్ర, పచ్చిమిర్చి, ఎండు మిర్చి, కరివేపాకు వేసి వేయించాలి. ఆ తర్వాత మామిడికాయ తురుము, ఉప్పు, పసుపు వేసి బాగా వేగనిచ్చి ఈ మిశ్రమాన్ని అన్నంలో వేసి బాగా కలపాలి. అంతే మామిడికాయ పులిహోర సిద్ధం. పులిహోర వల్ల అటు కార్బొహైడ్రేట్లతో పాటు ఇటు వేరుశనగ గింజలు, పప్పుల్లోని ప్రొటీన్లు మనకు అందుతాయి. ఇక మామిడికాయతో విటమిన్ సి అత్యధిక మోతాదులో అందే వీలుంటుంది.



పానకం

కావాల్సినవి

బెల్లం : కప్పు
యాలకుల పొడి : అర టీస్పూన్
మిరియాల పొడి: అర టీస్పూన్
శొంఠి పొడి : కొద్దిగా
చల్లని నీళ్ల : నాలుగు కప్పులు

తయారీ

ముందుగా బెల్లాన్ని నీటిలో వేసి కరగనివ్వాలి. దాన్ని వడగట్టి అందులో యాలకుల పొడి, మిరియాల పొడి, శొంఠి పొడి వేసుకోవాలి. దీనితో పాటు వడపప్పును కూడా సర్వ్ చేయచ్చు. దాన్ని తయారుచేయడానికి నానబెట్టిన పెసరపప్పు తీసుకొని అందులో కొన్ని బెల్లంముక్కలు వేసి అందించాలి. కావాలంటే కొద్దిగా పచ్చికొబ్బరి ముక్కలు కూడా చేర్చుకోవచ్చు. బెల్లం వల్ల మన శరీరానికి ఐరన్‌తో పాటు ఎన్నో అత్యవసరమైన విటమిన్లు, మినరల్స్ అందుతాయి. అంతేకాదు.. వేసవిలో ఇది మన శరీరాన్ని చల్లబరుస్తుంది. అతి దాహం నుంచి రక్షిస్తుంది.



ఉగాది వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

- విశాఖ జెసి కె.మయూర్ అశోక్



ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: శ్రీ విశ్వావసు నామ ఉగాది వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉగాది వేడుకల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఈనెల 30న ఉగాది వేడుకలను చిల్డ్రన్ ఎరీనా ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగు వారి సంప్రదాయం ఉట్టిపడే విధంగా మామిడాకుల తోరణాలు, అరటి చెట్లతో అలంకరణలు చేయాలని సూచించారు. కవి సమ్మేళనం, జ్యోతి ప్రజ్వలన తదితర ఏర్పాట్లను పర్యాటక శాఖ నిర్వహించాలని ఆదేశించారు. పార్కింగ్, బందోబస్తు ఏర్పాట్లు పోలీసు శాఖ చూడాలని సూచించారు. తాగునీరు, శానిటేషన్ పనులను జివిఎంసి అధికారులు చూడాలన్నారు. దేవాదాయ శాఖ, సింహాచలం దేవస్థానం శాఖల అధికారులు కలిసి పంచాంగ శ్రవణం ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా ఆడిటోరియంలో కార్యక్రమాలను వీక్షించేందుకు వీలుగా ఎల్ఇడి స్క్రీన్‌లను ఏర్పాటు చేయాలని సమాచార శాఖ అధికారులను ఆదేశించారు. ఉగాది సంబరాలు జరిగే ప్రాంగణమంతా పూలతో అలంకరించాలని హార్టికల్చర్ శాఖాధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. మెడికల్ క్యాంపు ఏర్పాట్లు, ఫైర్ ఫైటింగ్ పరికరాలను ఏర్పాటు చేయాలని సంబంధింత అధికారులకు తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖాధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ భవానీ శంకర్, విశాఖపట్నం, బీమిలి ఆర్డిఒ లు శ్రీలేఖ, సంగీత్ మహాదూర్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఆంగ్ల కాలమానంలో తెలుగు సంవత్సరాది

- తెలకపల్లి రవి

ప్రముఖ రాజకీయ విశ్లేషకులు

విన్నావా ఆరుద్రా తమాషా సంప్రదాయం నిలిచే వుంటుంది హమేషా అంటాడు శ్రీశ్రీ ఒక చోట. నిజంగానే సంప్రదాయాలు విశ్వాసాలు తరతరాలు కొనసాగుతుంటాయి. అయితే వాటి రూపం మారిపోతుంటుంది. అంతేగాక భిన్నమైన సంప్రదాయాలు సంస్కృతులు విశ్వాసాలు గల సువిశాల భారత దేశంలో ఈ క్రమం మరింతగా సాగుతుంటుంది. ఒక్కొక్క కుటుంబంలోనూ లేదా సమాజంలోనూ వచ్చే ఈ మార్పుల మొత్తం స్వరూపం అందరూ చేసుకునే పండుగలు పబ్బాల సమయంలో మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఆ విధంగా చూస్తే- తెలుగువారి తొలి పండుగ, తెలుగువారికే సొంతమైన పండుగ ఉగాదికి ఇది మరింతగా వర్తిస్తుంది. నిజానికి ఉగాదిని నూతన సంవత్సరాదిగా చూడాలి తప్ప ప్రత్యేకంగా పండుగ కాదనే వారూ వుంటారు. శ్రీక్రోధీనామ వీడ్కోలు పలుకుతూ శ్రీవిశ్వావసునామ సంవత్సరాదిని ఆహ్వానిస్తున్న వేళ, కాలం తెచ్చిన మార్పులపై ఒక లుక్....

భారతీయులకు పండుగల కొదవ లేదు. కొన్ని దేశ వ్యాపితమైనవైతే, కొన్ని ప్రాంతాలను బట్టి మారుతుంటాయి. ఉత్తరాదిన ధూం ధాంగా జరిగే పండుగలు కొన్ని దక్షిణాదిన అంతజోరుగా వుండకపోవచ్చు. హోలీ, దీపావళి వంటివి రెండు భాగాల్లో రెండు రకాలుగా మారుతుంటాయి. దక్షిణాదిన కూడా రాష్ట్రాలకే పరిమితమైనవీ వున్నాయి. ఆ ప్రకారమైతే దక్షిణాదిన మూడు భాషా రాష్ట్రాలలో జరిగేది ఉగాది. కన్నడికులు, మహా రాష్ట్రులు దీన్ని యుగాది అంటారు. యుగం అంటేనే సంవత్సరం అని కాలానికి సంబంధించిన ఒక లెక్క. కొత్త ఏడాది మొదలవుతుంది గనక ఉగాది. ఇంతకూ మొదలయ్యే ఏడాది అచ్చంగా తెలుగేనా అంటే సంవత్సరాల పేర్లన్నీ సంస్కృతంలో వుంటాయి. వాస్తవం చెప్పాలంటే ఈ సంప్రదాయ సంవత్సరాలను కూడా కేవలం భక్తి విశ్వాసాల అమలు కోసం ఇంకా చెప్పాలంటే ముహూర్తాలు వగైరా చూసుకోవడం కోసం మాత్రమే వినియోగిస్తున్నారు. రైతాంగం మాత్రం తమ పంటలను కొంత వరకూ ప్రకృతి మార్పులతో పోల్చి చెప్పడం కద్దు.

ఏ పండుగ కన్నా ఎక్కువగా ఉగాదిలోనే కాలం తెచ్చిన మార్పులు బాగా తెలుస్తాయి. జనవరి 1న హ్యాపీ న్యూ ఇయర్ అంటూ జరిగే హడావుడి ఉగాది రోజున వుంటుందా? ఎందుకుండదంటే ఇది దైనందిన జీవిత వ్యవహారాలలో ఉపయోగించడం లేదు గనక. లావాదేవీలు, ఉద్యోగ వ్యాపార పాలనా వ్యవహారాలు అన్నీ ఇంగ్లీషు కేలండర్ ప్రకారమే నడుస్తుంటాయి. ప్రపంచమంతటా అమలవుతున్న కాలం అదే. మనమూ దాన్ని బట్టే ఆలోచిస్తుంటాం. ప్రణాళికలు వేసుకుంటాం. మార్చి నుంచి జూన్ వరకూ పరీక్షలు వగైరా వుంటాయి. మార్చి 31కి వాణిజ్య సంవత్సరం పూర్తవుతుంది. ఇలా.. అనేకం వున్నాయి. ఇందులో ఏదీ తెలుగు ఏడాది లెక్క ప్రకారం జరగదు. పత్రికలు కూడా ఈ ప్రకారమే వస్తాయి. కాకపోతే తెలుగు పంచాంగం లెక్కలు కూడా వేస్తుంటారు.

ఉగాది అంటేనే మామిడి చిగుళ్ల కోకిల కూతలు వగైరా వగైరా మదిలో మెదులుతాయి. కవితలూ పాటలన్నిటా అవే ప్రత్యక్షమవుతుంటాయి. దేవులపల్లి కృష్ణశాస్త్రి లాటి వారు అచ్చంగా చిగుళ్ల కోయిలలచుట్టూనే అనేక పాటలు కట్టారు. సంప్రదాయ కవులైతే ఉగాది వూహ రాగానే పద్యాలు గుమ్మరించి వదులుతారు. అందులో అతి ప్రధానమైంది వసంత రుతు వర్ణణ. వసంతం అనగానే వలపుల తలపులు గుప్పుమంటాయి. కాని ఇప్పుడు మారిన పర్యావరణంలో జీవావరణంలో వసంతం అంతగా కనిపించేది లేదు, కనిపించినా పట్టించుకునేదీ లేదు. ఇప్పుడు రుతు పరిణామం గమనించేందుకు పట్టణాల్లోనూ చుట్టుకపక్కల పల్లెల్లోనూ పిల్లలకు అవకాశమే లేదు. అంతస్తులపై అంతస్తులుగా కొలువు తీరిన అపార్ట్‌మెంట్ సంస్కృతిలో మొక్కలు కనపించే అవకాశమే పరిమితం. ఇలాటప్పుడు కొత్త చిగుళ్లను వూహల్లో తప్ప వాస్తవంలో చూడగలిగే అవకాశం కొద్ది మంది వృక్ష ప్రేమికులకే పరిమితమై పోయింది. కొత్త చిగురు అలా వుంచితే కొత్త కుండలో నీళ్లు.. నీటి బాటిళ్ల రోజుల్లో కుండలన్నవి కనుమరుగవుతున్న స్థితి. ఇప్పుడిప్పుడే పర్యావరణ చైతన్యం మొక్కల పెంపకం అవసరం గుర్తిస్తున్నారు.

వసంతం అనగానే యువతీ యువకుల సరాగాలు సరస సంరంభాలు పాత కావ్యాల్లో పరుచుకుని వుంటాయి. ఇప్పుడైతే ఆ వసంత శోభకు ఏ స్థానమూ వుండటం లేదు. వాలంటీన్స్ డేలు ఆ స్థానాన్ని అలవోకగా ఆక్రమించేశాయి. వాలంటీన్స్ డే కార్డులు వేడుకల హంగామా ముందు వసంత ఉత్సవాలు కనిపించకుండా పోయాయి. అసలు ప్రేమ అనే మాట విలువ కోల్పోయి లవ్ అన్నదే దాని సార్వత్రిక భాషాతీత వ్యక్తీకరణగా ప్రపంచమంతటా స్థిరపడింది.

ఉగాది సంకేతాల్లో మావి చిగురు తర్వాతి స్థానం కోయిలదే. ప్రకృతి సహజమైన పక్షులు కిలకిల రావాలు, కోయిలు కుహూ రవాలు మాత్రం ఇప్పుడు అరుదై పోతున్నాయి. అసలు పిట్టలూ పిచ్చుకలే అదృశ్యమవుతున్నాయి. కోయిల పాటకు పర్యాయపదం పోతనామాత్యుడు భాగవతంలో 'మందార మకరండ మాధుర్యమున తేలు కోయిల చేరునే కుటజములకు' అని పద్యం కట్టాడు. కృష్ణశాస్త్రి గారి పాటల్లోనైతే ఎప్పుడూ చిగుళ్లు కోయిలలు, సెలయేళ్లు వంటివి పలకరిస్తూనే వుంటాయి. మావి చిగురు తినగానే కోయిల పలికేనా కోయిల గొంతు వినగానే మావి చిగురు తొడిగేనా అని ప్రశ్నిస్తాడు. చిగురాకుల వూయలలో ఇల మరిచిన ఓ చిలుకా అనేది ఎప్పటిదో పాత పాట. చిగురేసే మొగ్గేసే సొగసంత పూత పేసె చెయ్యయినా వెయ్యవేమీ ఓ బాబూ దొర అనే ఆలుమొగలు పాట కూడా చిగురుతో ముడిపడిందే. ఇంతకు ముందే చెప్పుకున్నట్టు చిగురునూ వలపునూ కలిపి పాటలల్లడం మన సినీ కవులకు రివాజు. ఇప్పుడు రీమిక్సింగులు తప్ప ఆ పాటల పల్లవులూ గల్లంతైపోయాయి.

కాగాపోగా ఏదో విధంగా అలాగే కొనసాగుతున్నది ఉగాది పచ్చడి వొక్కటే! షడ్రుచుల సమ్మేళనం అంటారు గాని చేదు కలపడం వల్లనే దానికి ప్రత్యేకత. ఇది అటూ ఇటూ తిరిగి ఇప్పుడు చేదు లేకుండా ఉగాది పచ్చడి చేస్తామనే వాళ్లు కనిపిస్తున్నారు. ఆ రోజున ఇళ్లలోనూ కార్యాలయాల్లోనూ మాత్రమే గాక హోటళ్లలోనూ మెస్సులలోనూ కూడా ఉగాది పచ్చడి వేస్తున్నారు. కొత్త చింతపండు, పచ్చి మిరపకాయలు, కొత్త బెల్లం, మామిడిపిందెలు, వేపపూత, ఉప్పు కలిపితే తయారయ్యేదే ఉగాది పచ్చడి.. వీటినే మధుర, ఆమ్ల (పులుపు) లవణ, కటు(కారం), తిక్త,(చేదు), కషాయం అని సంస్కృతంలో చెబుతారు. ప్రకృతిలో కొత్తగా కాస్తున్న దినుసులను కలపడమే ఇక్కడ విశేషం. చేదు చేరిక ఆ కవులకు బోలెడెంత పని కల్పించింది. చేదు కూడా ఒక రుచే అని ఇచ్ఛాపురం జగన్నాథం నవలే రాశారు. ఉగాది గురించిన ఆధునిక కవితలన్ని ఎక్కువగా ఈ చేదు చుట్టూ పరిభ్రమిస్తుంటాయి. ఎందుకంటే ఉగాది తెలుగు సాహిత్య సాంస్కృతిక వేడుకలకు ప్రసిద్ధి. కవి సమ్మేళనాలకు పెట్టింది పేరు. ఈ సమ్మేళనాల్లో కవి శేఖరులు అరిగిపోయిన ప్రాచీన పద్ధతుల్లో కోయిలల గురించి చిగుళ్ల గురించి వినిపించి శాలువల కప్పించుకుని నిష్క్రమించేవారు. ఆకాశవాణి ఏటేటా ఉగాదికి జరిపే కవి సమ్మేళనాల్లో విశ్వనాథ, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, ఆరుద్ర, దాశరథి, సినారె, ఇత్యాది పేద్ద కవుల నుంచి రేడియో వారి కటాక్షం నోచిన కుర్రకవులు వరకూ గేయాలు వచనాలు వినిపించడం మొదలెట్టాక ఈ బాణీ మారింది. జీవితంలో చేదుగా మారిందనీ, కోయిలలు ఎక్కడ కనిపిస్తున్నాయని ప్రశ్నిస్తూ కవితలు రాస్తుంటారు.

ఇంగ్లీషు వారి కాలమానంలో సంవత్సరాలకు సంఖ్యలుంటాయి గాని భారతీయ సంప్రదాయంలో పేర్లు తిరుగుతుంటాయి. అరవై నాలుగు సంవత్సరాలకూ ప్రభవ, విభవలతో మొదలెట్టి వికృత, వ్యయ, రుణ, విక్రమ, రౌద్ర, రక్తాక్షి, ప్రమోదూత, ప్రమాది ప్రజోత్పత్తి తదితర నామధేయాలుంటాయి ఇందులో కొన్ని మధురమైన పేర్లు కాగా మరికొన్ని భయానకంగానూ వుంటాయి. ప్రారంభాన్ని సూచించే ప్రభవతో మొదలై క్షయతో ముగుస్తుంది. మిగతా.. 8లో..











కూయవే.. ఓ కోయిలమ్మ..



ప్రజాశక్తి – విశాఖపట్నం : ఉగాది దగ్గర పడుతుంటే ఉత్సాహంతో ఉరకలేస్తోంది కోయిలమ్మ. పాటలే లోకంగా పరవశిస్తోంది! ఆ ఆనందంతో ఉగాది సన్నాహాలు ఎలా ఉన్నాయో చూద్దామని బయల్దేరింది. కొండా కోనా దాటింది. వాగూవంకా వెదికింది. చెట్టూ పుట్టా చూసింది. ఊరూవాడా గాలించింది. ఎక్కడుంది సందడని వెతుకుతూనే సాగుతోంది!

ఓ చోట పసిపాప చిరునవ్వులా విరబూసి, వేపచెట్టు కనిపించింది. కోయిల ఆ చెట్టుపై వాలి కుహూ కుహూ అని పాడబోయింది. కాపలాదారు గద్దింపు వినిపించి, ఆగిపోయింది. వేపచెట్టుకు కూడా కాపలానా!? అని ఆశ్చర్యపోతుంటే– చెట్టుకు దిగేసిన ఇనుపరేకు కనిపించింది. దానిపై 'ఈ చెట్టుపై అమెరికాది పేటెంటు. ఆకుకోసినా, పువ్వు తెంపినా తప్పదు చీకటికొట్టు.' అన్న హెచ్చరిక ఉంది.

నివ్వెరపోయిన కోయిల నింగిలోకి ఎగిరింది.

ఎంతసేపో ఎగిరెగిరి ఓ తోట గట్టున వాలింది.

అది నిండుగా పండిన చెరుకుతోట. తీపివాసన మనసును మధురం చేస్తుంటే... గొంతెత్తబోయింది. గట్టుపై విషాదం నింపుకున్న రైతు కనిపించాడు. 'తోట ఇలా తొణికిసలాడుతుంటే– నీ ముఖంలో విచారం ఎందుకన్నా?' అని అడిగింది. 'ఎందుకా? ఇది తీపి చెరకు కాదు, చేదునిచ్చే సరుకు. ధర దక్కని పంట. మా జీవితాలకు మంట.' అని చిరచిరలాడాడు రైతు.

అన్నదాతకు ఇంత ఆవేదనా? అని కలవరపడింది.

అక్కడ నిలవలేక ఎగిరిపోయింది. ఓ వీధి చివరి పెరట్లో విరగగాచిన మామిడి కనిపించింది. అయితే, ఆ ఇంట్లోని పిల్లలు ఆ తియ్యని పుల్లని కాయలకోసం తహతహలాడడం లేదు. టెంకలేని మామిడిలో మజా ఆస్వాదిస్తున్నారు. చివుక్కుమంది మనసు. పాటను మరిచిపోయి, పైకెగిరింది.

కోనసీమలాంటి పూసపాటిరేగ తీరంలో కొబ్బరి పంట కోటి తెగుళ్లతో కునారిల్లుతూ కనిపించింది. దిగుబడీ, ధరా లేక దిగులుగా ఉంది. కొండమీద 'ధర' లేదని చింతించిన చింతపండు.. పట్టణం ప్యాకెట్లో సరికొత్తగా పలకరించింది. ఇప్పుడు రేటు ఎక్కువై సామాన్యుడికి భారమయ్యానని బాధపడింది! కోయిలమ్మ ఉత్సాహం నీరు కారిపోయింది. నీరసం ఆవరించింది. పచ్చడి దినుసులే ఇంత భారమైతే, పండగ ఇంకెంత భారమో? అనుకుంది.

ఇంతలో 'కుహూకుహూ'మని ఓ కమ్మని స్వరం వినిపించింది. ప్రాణం లేచొచ్చి, అటు చూసింది. అదో సెల్‌ఫోను కాలర్ ట్యూను! తన గొంతునిలా వెంటపెట్టుకున్నందుకు సంతోషించాలా? వసంతకోకిల కోసం ఎదురుచూసే జనం ఉండరని విచారించాలా?

'హ్యాపీ టెల్గు న్యూ ఇయర్, హ్యాపీ ఉగాదీ...' ఫోన్లో తన మిత్రుడికి చెబుతున్నాడు సెల్‌వాలా!

'హతవిధీ... తెలుగు సంవత్సరాదికి ఏమి దుస్థితి ఇది?!' అనుకుంటూ కొండకోనలవైపు ఎగిరిపోయింది... పాపం... కోయిలమ్మ!

పండగల పరమార్థం

ప్రజాశక్తి – విశాఖపట్నం : తెలుగు సంవత్సరాలు 60. వరుస క్రమం ప్రభవతో మొదలై అక్షయతో ముగుస్తుంది. ఇప్పుడు కొత్త సంవత్సరం పేరు శ్రీ విశ్వావసు. ఇప్పటివరకూ నడిచిన సంవత్సరం శ్రీ క్రోధినామ. వీటిని అనుకోవడానికి తప్ప అనుకోగానే నిర్దిష్టంగా గుర్తించలేం. ఎందుకంటే సంఖ్యల్లో ఉండవు కాబట్టి. పైగా ప్రపంచంలో ఇంకెవరూ ఈ పేర్లను వాడరు కాబట్టి. సులభంగా నమోదు చేయడానికి వీలుగా క్రీస్తుశకం పద్ధతినే మనం అనుసరిస్తున్నాం. ప్రపంచం మొత్తంతో కలిసి సాగాల్సిన ఆధునిక కాలంలో మనకు సౌలభ్యం ముఖ్యం తప్ప సంప్రదాయం కాదు. స్వదేశీ, స్వరాష్ట్రం పేరుతో మనం ప్రభవ, విభవ సంవత్సరాలనే అధికారిక లెక్కల్లో నమోదు చేస్తే– మనది మాత్రమే ఒక ప్రపంచంగా మిగిలిపోతుంది. పద్ధతి ఎక్కడిది, ఎవరిది అన్నది కాదు; అది మనకు సౌలభ్యమా, కాదా అన్నది ప్రధానం. వీలైనదానిని ఎక్కడినుంచైనా స్వీకరించడం, అనుసరించడం మనం పాటిస్తున్న పద్ధతి.

పంచాంగాలు కూడా మనదేశంలోని అన్ని ప్రాంతాల్లో ఒకేలా ఉండవు. కొందరిది సూర్యమాన పద్ధతైతే, మరికొందరిది చాంద్రమాన పద్ధతి. పండగల నిర్వహణకు సంబంధించిన తిథుల గణనలో వ్యత్యాసాలూ, ఆ సందర్భంగా పంచాంగకర్తల మధ్య వాదోపవాదాలూ మనం తరచూ చూస్తూనే ఉంటాం. వీటితో సంబంధం లేకుండా ఏదొకరోజు జనం పండగలను జరుపుకుంటూనే ఉన్నారు. ఇక్కడ పదిమంది కలిసి చేసుకొనే సందడి ముఖ్యం తప్ప ఆ సందర్భంగా తలెత్తే అశాస్త్రీయ వాదాల నిర్దేశాలు కావు. తరచూ ఆచరణలో జనం దీనిని నిరూపిస్తూనే ఉన్నారు.

ఉగాది పంచాంగంలో రాజపూజ్యాలు, అవమానాలు, ఆదాయ వ్యయాలు అంటూ పేరును బట్టి– ఈ ఏడాది ఎవరికి ఎలా ఉండబోతుందో చెబుతారు. ఉపాధి, ఉద్యోగం, ఉత్పత్తి మీద ఆధారపడే ఆదాయం ఉంటుందని మనందరికీ తెలుసు. పేర్లను బట్టి పరిస్థితి అనుకుంటే– అంబానీ అప్పుడప్పుడు పేదోడు అవ్వాలి.

మన పక్కింటి పార్వతీశం కనీసం ఒక్కసారన్నా కోటీశ్వరుడు అయితీరాలి. కానీ, అలా జరగదు. కాబట్టి– అదంతా ఒక తంతు. ప్రకృతి పండగ ఉగాదిని నేల నుంచి ఊహల్లోకి, చేతన నుంచి చాదస్తంలోకి మళ్లించిన తతంగం.

ఆరోగ్యదాయకం.. ఉగాది పచ్చడి



ప్రజాశక్తి – విశాఖపట్నం

ఔషధ విలువల సమ్మేళనమే ఉగాది పచ్చడి. వేప పువ్వు, లేతమామిడి కాయలు, పచ్చి మిర్చి, అరటిపండు, కొత్త చింతపండు, కొత్త బెల్లం, మిరియాల పొడి, ఉప్పు మిశ్రమమే ఉగాది పచ్చడి. చేదుగా, తియ్యగా, వగరుగా, ఘాటుగా, పులుపుగా, షడ్రుచుల సంగమం ఉగాది పచ్చడి. మనిషి జీవితంలో జరిగే ఒడిదుడుకులకూ, సుఖ దుఃఖాలకూ దీన్ని ప్రతీకగా చెబుతుంటారు. వేపపువ్వు చేదు అనుకుంటాం గానీ, మన ఆరోగ్యాన్ని కాపాడే అమృతం అది. ఈ పువ్వులో విటమిన్ ఎ, కాల్షియం, ప్రొటీన్లు పుష్కలంగా ఉన్నాయి. వాతం, జ్వరం దగ్గును దరిచేరనివ్వదు. వేపాకులు, వేపపువ్వు క్రిమిసంహారిణి కావడం వల్ల అమ్మవారు (పొంగు) పోసినపుడు పక్కలోనే ఉంచుతాం. వేప చిగుళ్ల నూరి మాత్రలుగా చేసి, పసుపు కలిపి మింగిస్తున్నాం. గజ్జి, కుష్టు వంటి వ్యాధుల్నీ ఇది హరిస్తుందని ఆయుర్వేదం చెప్తోంది. జీర్ణక్రియను సజావుగా నిలుపుతుంది. చర్మ వ్యాధుల్ని అరికడుతుంది. మామిడిలో విటమిన్ 'సి', 'ఎ'లతో పాటు మరెన్నో పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. పేగు క్యాన్సర్ ఉన్న వారికి మంచిదని డాక్టర్లు చెబుతున్నారు. చెటమ రూపంలో పోతున్న శక్తిని ఉప్పు తిరిగి శరీరానికి అందిస్తుంది. ఎముకలకు పుష్టిని ఇస్తుంది. తీపి చక్కెర, బెల్లంలో ఉంటుంది. బెల్లం ఆరోగ్యానికి శ్రేయస్కరం. రక్తాన్ని వృద్ధి పరుస్తుంది. కాలేయాన్ని శుద్ధిచేసి కామెర్ల వ్యాధిని నివారిస్తుంది. శరీరానికి బలాన్నిస్తుంది. మిరియాల కషాయం గురించి తెలిసిందే. అది కఫవాతాలను పోగొట్టి దగ్గు, శ్లేష రోగాలను అరికడుతుంది. పులుపునిచ్చే చింతపండులో విటమిన్ 'డి', 'సి' పుష్కలంగా ఉంటాయి. ఇది పైత్యాన్ని, అరుచిని పోగొడుతుంది.





వ్యాపారాలకు ఉగాది జోష్

ఎసిలు, ఫ్రిజ్‌లు, ఎయిర్ కూలర్లపై ప్రత్యేక ఆఫర్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్/ఎంవిపి.కాలనీ

తెలుగువారి తొలి పండగ ఉగాది సందర్భంగా నగరంలో అన్ని రకాల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. ఎలక్ట్రానిక్ వస్తువుల అమ్మకాలలో ఎసిలు, ఫ్రిజ్, ఎయిర్ కూలర్ల అమ్మకాలు అధికంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఎండల తీవ్రత పెరిగింది. వచ్చే నెల నుంచి ఉష్ణోగ్రతలు మరింత పెరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎండల తీవ్రతను తట్టుకోవటంలో భాగంగా మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ప్రజలు ఈ ఉగాది సందర్భంగా ఎసిల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కొందరైతే ఎసిలతో పాటు ఫ్రిజ్‌లు కూడా కొనడానికి మొగ్గుచూపుతున్నారు. మరికొంత మంది ఎయిర్ కూలర్లు కొనుగోలు పట్ల ఆసక్తి చూపుతున్నారు. దీంతో చల్లదనాన్ని ఇచ్చే ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల విక్రయాలు ఊపందుకున్నాయి. దీనిని ఆసరాగా చేసుకుని వివిధ కంపెనీలు ఉగాది సందర్భంగా భారీ డిస్కౌంట్లును ప్రకటించాయి. ఇదే మంచి అవకాశంగా నగర ప్రజలు భావిస్తూ కొనుగోళ్లపై ఆసక్తి పెంచుకుంటున్నారు. ఇంటిని చల్లగా ఉంచే ఎసిల పట్ల ప్రజలు ఆసక్తి చూపుతున్నప్పటికీ వాటి ధరలను చూసి కొందరు భయపడుతున్నారు. ఇక ఎసిలను పరిశీలిస్తే గతంలో విండో ఎసిలు ఎక్కువగా కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం అన్ని విధాల సౌకర్యంగా ఉండే స్పిట్ ఎసి వైపు మొగ్గు చూపుతున్నారు. మార్కెట్లో ఒక టన్ను సామర్థ్యం నుంచి ఆ పై స్థాయిలో ఇంటి అవసరాలకు అనుగుణంగా రకరకాల ఎసిలు లభిస్తున్నాయి. రూ.30 వేలు నుంచి రూ.లక్ష ధర వరకూ కంపెనీల ఎసిలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో కూడా విద్యుత్ ఆదా చేసేందుకు వీలుగా ఉండే స్టార్ రేటింగ్‌కు ఎక్కువ మంది ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇంటి అవసరాలకు స్టార్ రేటింగ్ ఉన్న ఎసిలను కొనుగోలు చేస్తే సరిపోతుందని వ్యాపారస్తులు చెబుతున్నారు. 8 గంటల కన్నా ఎక్కువ వినియోగం ఉంటే మాత్రం 5 స్టార్ రేటింగ్ ఇన్వర్టర్ మోడల్ కొనుగోలు చేయాల్సిందే. వీటిని ఇంటికి చేర్చి, ఇన్‌స్టాలేషన్ (అమరిక) కూడా ఉచితంగా చేస్తున్నారు. పూర్తిగా డబ్బులు చెల్లించి కొనుగోలు చేసే వారికి ధరలో 5 శాతం తగ్గించి ఎసిలు ఇస్తుండగా, కొన్ని షాపుల వారు ఒక్క రూపాయి చెల్లించి ఎసి, రిఫ్రిజిరేటర్ తీసుకు వెళ్లండని ప్రచారం చేస్తున్నారు.

వేసవిలో చల్లని నీరు తాగేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తారు. చల్లని నీరు తాగాలని, వేసవి ధాటికి కూరగాయలు, ఆహారపదార్థాలు



పాడవకుండా ఉండాలంటే రిఫ్రిజిరేటర్ ఉండాల్సిందే. వివిధ కంపెనీలకు చెందిన సింగల్, డబుల్ డోర్ రిఫ్రిజిరేటర్లు పలు మోడళ్లలో, ఆకర్షణీయ రంగుల్లో, సైజుల్లో వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. పరిమాణం, సదుపాయాలు, స్టార్ రేటింగ్‌ను బట్టి మార్కెట్లో వీటి ధర రూ.15 వేల నుంచి ఆపై ధరలలో లభిస్తున్నాయి. వంటగదికి అవసరమైన 165 లీటర్ల నుంచి 300 లీటర్ల వరకు, పడకగది అవసరాలకు తగ్గట్టుగా ఉండే 50 లీటర్లు, 80 లీటర్ల రిఫ్రిజిరేటర్లు మార్కెట్లో లభిస్తున్నాయి. అదేవిధంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన ఎయిర్ కూలర్లు కూడా మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ఎసిలు కొనుగోలు చేయలేని వారు వీటిపై ఆసక్తి చూపుతున్నారు. 10 లీటర్ల నుంచి 20 లీటర్ల సామర్థ్యంతో ఇవి రూ.10 వేల ధరలో లభిస్తున్నాయి.

శామ్‌సంగ్ ఉపకరణాలపై రాయితీలు

ఉగాది సందర్భంగా ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్ పలు ఆఫర్లను ముందుకు తెచ్చినట్టు ఆ సంస్థ ప్రతినిధి శ్రీని మీడియాకు వెల్లడించారు. ఎఐ ఆధారిత రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషిన్లు, ఎయిర్ కండిషనర్లు, మైక్రోవేవ్‌లు ఇప్పుడు అద్భుతమైన డీల్స్‌తో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ పరిమిత కాలపు ఆఫర్లు మార్చి 31 వరకు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు. సమీప శామ్‌సంగ్ స్టోర్‌ను సందర్శించి లేదా ఆన్‌లైన్‌లోనూ ఆఫర్ల కోసం సంప్రదించవచ్చునని తెలిపారు. ఎంచుకున్న డిజిటల్ ఉపకరణాలపై 48 శాతం వరకు తగ్గింపు, రూ.20 వేలు క్యాష్‌బ్యాక్ సులభమైన జీరో డౌన్ పేమెంట్ ఎంపికలను పొందవచ్చునన్నారు. రూ.4,290 విలువైన శామ్‌సంగ్ కేర్ ప్లస్ అందించే 2 సంవత్సరాల పొడిగించిన సమగ్ర వారంటీ ఇప్పుడు కేవలం రూ.499 వద్ద లభిస్తుందని తెలిపారు.

ఆంగ్ల కాలమానంలో తెలుగు సంవత్సరాది

(6వ పేజీ తరువాయి..) 1910లోనే ఆంధ్ర పత్రిక వ్యవస్థాపకుడైన కాశీనాథుని నాగేశ్వరరావు ఉగాది సంచికల సంప్రదాయం మొదలెట్టారు. అంటే వంద ఏళ్ల కిందటే.. వాటిపై వచ్చిన పరిశోధనా వ్యాసాలను తిరగేస్తే కాలగమనంలో మానవ ప్రస్థానం కళ్లకు కడుతుంది. ఉదాహరణకు 1919 ఉగాది సంచికలో జలియన్ వాలాబాగ్ దురంతాలపై నియమించిన హంటర్ కమీషన్ అభిశంసనను సుదీర్ఘంగా ప్రచురించారు. భారత ప్రభుత్వం చెన్న రాష్ట్రము పట్ల చూపుచున్న వివక్షనే చెన్న రాష్ట్ర ప్రభుత్వము ఆంధ్రుల పట్ల చూపుచున్నది అని నాటి పరిస్థితిని ప్రస్తావించింది. 1944 రెండవ ప్రపంచ యుద్ధ పరిస్థితిలో సంచిక తక్కువ పేజీలతో వచ్చింది. తర్వాతి కాలంలో సుప్రసిద్ధులైన తెలుగు కవులు, రచయితల తొలి అడుగుల అక్షరాలు కూడా ఈ సంచికల్లోనే చూడగలము.

నమ్మకాలు గల వారికి ఉగాదినాడు పంచాంగ శ్రవణం తప్పనిసరి. మీడియా విస్తరణతో ఈ పంచాంగ పఠనం పెద్ద ప్రహసనంగా మారిపోయింది. అధికారికంగా నిర్వహించే పఠనానికి ముఖ్యమంత్రి విచ్చేసి వింటారు. అక్కడ పఠనం ఏలినవారికి ఏ మాత్రం నొప్పికలిగించకుండా మెప్పించే ఫక్కీలో నడుస్తుంది. అదే సమయంలో కొందరు ప్రతిపక్ష నేతలు తమ తమ ఆస్థానాల్లో ఈ తతంగం ఏర్పాటు చేసుకుంటారు. ఏ గూటి చిలక ఆ పాట పాడినట్టు ఏ పార్టీ కేంద్రంలో పంచాంగం వారికి అనుకూలంగా వినిపిస్తుంది. రాజకీయ విశ్లేషణలా మారి అసమ్మతి, ప్రతిపక్షం, ఎన్నికలు వంటివి అలవోకగా చెప్పేస్తుంటారు పంచాంగ కర్తలు. ఆహ్వానించిన వారిని అలరించడమే ఏకైక సూత్రమనేది అన్నిటినీ మించిన సంప్రదాయం! పంచాంగం అంటే ఏమిటి? పంచ అంగాలు- లేదా అయిదు భాగాలు..... తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అన్నవే అయిదు అంగాలంటారు. ఇందులో వారం నక్షత్రం ఖగోళ సంబంధమైనవైతే మిగిలినవన్నీ నమ్మకాలతో ముడిపడినవే. ఫలానా సమయంలో ఫలానా తిథి గనక ఆ సమయంలో ఫలానా పని చేస్తే కలిగే యోగం ఇలా వుంటుందని చెప్పడమన్న మాట. ఏ పని చేయాలన్నా ముందు ముహూర్తం చూసుకుని మొదలెట్టే అలవాటు ఇప్పటికీ అత్యధికులు కొనసాగిస్తుంటారు. అయితే ఇక్కడ కూడా జీవిత వాస్తవానికి తరతరాల విశ్వాసాలకు వైరుధ్యం ఎదురవుతూనే వుంటుంది. ఉదాహరణకు పరీక్షలు, ఇంటర్వ్యూలు, ఎన్నికలు ఇవేవీ ఎవరో ఒకరు అనుకున్న ప్రకారం మొదలు కావు. అలాగే ఉభయ పక్షాలూ ముహూర్తాలు చూసుకుని బయిలుదేరినా ఎన్నికలలో ఒకరినే విజయం వరిస్తుంది. అయినా సరే తమ వరకూ తాము ఏవో ముహూర్తాలను అనుసరించడం ఒక ఆనవాయితీ.

వాస్తవానికి ఉగాది సందర్భంలో వందలాది మంది విడుదల చేసే పంచాంగాలలో ఎన్నో తేడాలు వుంటాయి. తిరుపతి, భద్రాచలం వంటి చోట పండుగలు, గ్రహణాలకు సంబంధించి అనుసరించే కాల గణనలోనే తేడాలు కనిపిస్తుంటాయి. అయితే భారతీయ ఖగోళ శాస్త్రం చాలా గొప్పది గనక గ్రహ గతులను గురించిన లెక్కలు చాలా వరకూ సరిగ్గానే నడుస్తుంటాయి. శాస్త్ర బద్ధమైన ఆ అవగాహనకు తమ నమ్మకాలను జోడిస్తారు పంచాంగ కర్తలు. ఇవన్నీ వున్నా నిర్ణయం తీసుకోవడం మాత్రం జనవరి, ఫిబ్రవరి లెక్కలోనే జరుగుతుంది. కాకపోతే వాటికి సరిగా వచ్చే శ్రావణ మాసం, ఫల్గుణ మాసం వంటివి కొన్ని ప్రత్యేకంగా చెప్పుకుంటారు. పల్లెల్లో రైతాంగం కార్తెలను అనుసరిస్తున్నా వారి లావాదేవీలు మాత్రం మామూలు కేలండరే అనుసరిస్తారు.

కేలండర్ వినియోగంలో ఈ మార్పు ఎక్కడి వరకూ వచ్చిందంటే ఒకప్పుడు ఉగాది ఎక్కువగా మార్చి నెలలో వచ్చేది. పర్యావరణంలో వచ్చిన మార్పులు, సూర్య గమనంలో తేడాలతో ఇప్పుడు అది ఏప్రిల్‌లో కూడా వస్తుంది. ఎవరైనా ఉగాది ఎప్పుడంటే ఫలానా తేదీ అని చెబుతారు గాని చైత్ర శుద్ధ పాడ్యమి అనరు! సెలవులు గట్రా ఆ విధంగానే తీసుకుంటారు. ఇవన్నీ విశ్వాసం వాస్తవాలతో సర్దుబాటు చేసుకొని మనుగడ సాగిస్తున్న తీరుకు ఉదాహరణలే. బ్రిటిష్ సామ్రాజ్యాధిపత్యం ప్రతిచోటా తన కేలండర్‌నే వాడుకలోకి తెచ్చింది. చంద్రమాన సంవత్సరాలలో నెలకు నాలుగు వారాలు చొప్పునే లెక్కించి దాన్ని సరిచేయడానికి అధిక మాసం, శూన్యమాసం లెక్కిస్తుంటారు. ఇందుకు భిన్నంగా ఇంగ్లీషు కేలండర్‌లో నెలను బట్టి 30, 31 రోజులు ఖాయం చేసి ఫిబ్రవరిలో మాత్రం 28, లీపు సంవత్సరంలో మాత్రం 29 రోజులు చూపిస్తుంటారు. చాంద్రమానం ఆధారంగా కాలాన్ని గణించిన భారతీయ సంప్రదాయానికి సౌరమానంపై ఆధారపడిన పాశ్చాత్య గణనకు మూలంలోనే తేడా వుంది. అయినా రెంటినీ కలగలిపిన మిశ్రమ జాతకాలు ఇప్పుడు నడుస్తున్నాయంటే అంతకంటే గత్యంతరం లేదు గనకే. అందుకే ఆ రోజున పర్వదిన లాంచనాలతో పాటు కానుకలివ్వడం, దస్త్రం మార్చడం వంటి పనులు చేస్తారు.

ఏది ఏమైనా ఉగాదిని ఇంగ్లీషు కాలంలో తెలుగు ఏడాదిగానూ, సంప్రదాయ సంవత్సరంగానూ పరిగణించడం వాస్తవానికి దగ్గరగా ప్రాణానికి సుఖంగా వుంటుంది.